VISIT…

LANZAROTE Caliente.COM




చందమామ
దీపావళి ప్రత్యేక సంచిక

Photo by 'Ramana'



బహుమతి
పొందిన వ్యాఖ్య

ఇన్ని టీకప్పులకు...

పంపినవారు:
వి. వి. చార్యులు - హైదాబాదు.

చందమామ

ఈ సంచికలో కథలు - వింతలు - విశేషాలు

మహాభారతం	... 2	రత్నావళి	... 41
క్షీరసాగరమథనం (గే.క.)	5	సోమరి నాగు	... 57
జ్వాలాద్వీపం—11	... 9	మేవార్ సింహం	... 66
పుట్టినరోజు - పండగ	... 17	దీపం ఆత్మకథ	... 73
మార్కోపోలో	... 25	గుణాఢ్యుడి కథ	... 82
నేరానికి బహుమానం (బే.క.)	33	గుడ్డి జోస్యం	... 88

ఇవి గాక కార్టూనులు, ఫొటోశీర్షికల పోటీ మొదలైన మరి ఎన్నో ఆకర్షణలు

అందరూ అక్కరగా ఒత్తిడి పెడుతున్నందున

మా ఓకె OK బహుమాన ప్రదానం

మరిన్ని ప్రారంభించాం (కొంత కాలావధివరకు మాత్రమే)

'ఓకె' పాఠకవర్గంవా రనేకులు మరీ మరిన్ని కావాలని ఒత్తిడి పెడుతున్నందువల్ల, మేము ఇంతకు ముందు ఇస్తూన్న, దంత ధావళ్యంతో నిగనిగలాడుతూ ఆత్యాకర్షకమగు మా ఒరిజినల్ 'ఓకె' సబ్బుపెట్టె ఉచిత బహుమాన ప్రదానం కొంత కాలావధివరకు మాత్రం మరల ప్రారంభిస్తున్నాం — ఇది కేవలం ఉచితం.

ఈ బహుమాన ప్రదానం దీపావళి సమయం కొరకే అయినా, మావద్ద స్టాకు ఉన్నంతకాలం వరకూ ఇస్తూనే వుంటాం.

ఇప్పుడే కొనండి — ఆలస్యం చేయకండి

మీ చర్మ సౌందర్యంకొరకు

★ అధిక గ్లిసరిన్
చర్మం మృదువుపరచుకొరకు

★ లనొలిన్
చర్మ రక్షణకొరకు

★ ఆక్టమర్
చర్మరోగ నివారణకొరకు





ఓ.కే చందన సబ్బు

ఉచితం

ఓ.కె చందనసబ్బు 3 బిళ్లలు కొనండి. ఆత్యాకర్షకమగు దంతం లాగ నిగనిగలాడు సబ్బుపెట్టెను కేవలం ఉచితంగా పొందండి.



ది ఈస్ట్ ఏష్యాటిక్ కంపెనీ
(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్,
మద్రాసు - 1

EP

మీ అభిరుచికి తగిన స్థాయిలలో మధురగానం వినిపించే



టెలిరాడ్

హైఫీ టోనల్ నాణ్యంతో రెండు సరికొత్త మోడల్స్

మోడల్ D 669 W K Hi-Fi (A C)


మోడల్ D 669 GWK Hi-Fi (AC/DC)

వెల రు. 455/-

స్థానిక పన్నులు అదనం.

పొడుపైన ఈ అల్ట్రా సెన్సిటివ్ రేడియో హై-ఫీ టెలిరాడ్ శ్రేణికి చెందిన సరికొత్త నిర్మాణము. గిల్టు అలంకారముతో కూడిన చక్కటి కాబినెటు.

దీనికి రెండు స్పీకర్లు అమర్పబడి, హెచ్చు–తగ్గు స్థాయిలలో గానము చేయుటకు చక్కగా తగియున్నది. ఎట్టి చిక్కులు లేకుండ చిరకాలము పనిచేయగల దృఢమైన నిర్మాణము.



6 వాల్వులు, 4 బాండ్లు

బాండ్ స్ప్రెడ్ కంట్రోల్ సహా

మీడియం వేవ్

593 – 186 m (570 1620 Kc)

షార్ట్ వేవ్స్:

187 - 65 m 1.6 - 4.6 Mc/s

70 - 29.4 m 4.2 - 10.2 Mc/s

2 - 11.1 m 10.3 - 27 Mc/s

మద్రాసుకు, ఆంధ్రప్రదేశ్‌కు పంపకదారులు:

తంతి: OBRED

ఓబుల్‌రెడ్డి (మద్రాసు) ప్రైవేట్ లిమిటెడ్,

ఫోన్: 84830

31, జనరల్ పేటర్స్‌రోడ్డు :: మద్రాసు - 2.



పిల్ఫర్-ప్రూఫ్ శ్వేత రంగుగల మూత ఉన్నదా అని చూడండి.
Waterbury's
VITAMIN
Compound
శ్వేత రంగు లేబిల ఉన్నదా అని చూడండి.





సుశీల
ఇచ్చే
విందుల్లో
విశేషమేమిటి?
MONACO
MONACO
సుశీల.... పేరుకు తగ్గట్లే సౌ-శీల్యం కలది.
అతిథి సత్కారంలో ఆమెనే చెప్పుకోవాలి.
అతి తాజాగా, కరకర లాడుతూ వున్న
పార్లేవారి మొనాకో సాల్టెడ్ బిస్కట్లపై తీపి
పదార్థాలూ, ఆపిల్ ముక్కలూ, కోవా,
పచ్చళ్ళూ పెట్టి ఆశ్చర్యకరంగా సత్కరిస్తుంది.
అందుకే అతిథులంతా సంతోషంగా ఆమె
నెప్పుడూ పొగుడుతుంటారు.
పార్లేవారి
మొనాకో
ఖారా బిస్కట్లు
పార్లె ప్రోడక్ట్స్ మ్యాన్యుఫెక్చరింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, బొంబాయి-24

తారతమ్యము తెలిసిన ముద్రాపకుడు

తన పనికి కావలసిన పరికరాలు, అనగా
—చక్కటి కాగితం, మంచి సిరా, స్ఫుటమైన టైపు
ఎంచుకొనుటలో ఎంతో జాగ్రత్త తీసుకొనును

అతను **గేంజస్ సిరా లనే** ఉపయోగించును

ఎందుచేతనంటే

నాణ్యమునకు, పొదుపునకు
సుఖంగా పని సాగిపోవటానికి

ఈ సిరాలు నమ్మకమైనవని అతనికి తెలుసును

ఫ్యాక్టరీలు: హౌరా • బొంబాయి • మద్రాసు.





సంపూర్ణ శిరోజ పోషకము మరియు శిరోజాలను నలుపు చేయునది మనోహర సువాసన గలది

ఆధునిక విజ్ఞానం మరియు బాహుళ్యమైన అనుభవం ఈ రెండింటి సమ్మిశ్రితం

లోమ

REGD.



లోమ, ఆధునిక విజ్ఞానం మరియు బాహుళ్యమైన అనుభవం, ఈ రెండింటి సమ్మిశ్రితమైన అత్యధిక పరిశోధన యొక్క ఉత్పత్తి. ఇదే దాని విజయవంతమైన ఫలితమునకు రహస్యం.

సోల్ డిస్ట్రిబ్యూటర్స్ అండ్ ఎక్స్‌పోర్టర్స్:
ఎం. ఎం. ఖంబాట్ వాలా,
అహ్మదాబాద్-1

TEL

ప్రతి సోమవారం రాత్రి 8-30 గం॥లకు సిలోన్ రేడియోమీద "లోమా సంగీత్ ఖజానా" వినండి.

విశాలాంధ్ర అంతటా విజయవంతంగా నడుస్తోంది!

మహేశ్వరి ప్రొడక్షన్స్

రమాసుందరి

మ్యూజిక్.. సుసర్ల దక్షిణామూర్తి * డైరెక్షన్.. హున్సూరి కృష్ణమూర్తి

శ్రీ ఫిలింస్ రిలీజ్.

నిర్మాత... కె. బావనారాయణ

Nutrine మిఠాయిలు



న్యూట్రిన్‌వారి రుచికరమైన మీగడ గల టాఫీలు, మీరు పదిలపరుచుకోవడానికి ఉత్సాహపడేటంతటి రమ్యమైన టిన్నులలో దొరకును.

అది గాక, న్యూట్రిన్ టిన్నులలో మిఠాయిలు సగముసగము గాకుండా, పూర్తిగా నింపుటచే, మీకు ఎక్కువ టాఫీలు లభించును.

న్యూట్రిన్ కన్ఫెక్షనరీ కంపెనీ ప్రైవేట్ లి.
చిత్తూరు, ఆంధ్ర ప్రదేశ్.

"సరోజ హక్కు"

"మా అన్నయ్యను వదిన సరోజ సహా సాగనంపి ఇంటికి వచ్చాం. వాడుక చీర మార్చ డానికి ధరించియున్న ఆ మెరిసే చీర విప్పబోతూ, దాని కాంతికి విస్తుపోయాను. ఆ చీర, సరోజను, ఆమె మా యింట్లో వున్నవారం రోజులూ ఇంటినెలా వుంచుకోవాలో ఇంటి పనుల నెలా సమర్థించుకోవాలో నేర్పిన ప్రాముఖ్యతను జ్ఞప్తికి తెచ్చింది. మా వదిన వెళ్లేముందు"......

*　*　*　*　*

"...... ఆ సమయంలో నారవికెకు నప్పేచీరకోసం ట్రంకంతా గాలించాను. మా అన్నయ్య నా కోసం తెచ్చిన 'పులిచారల' చీర తప్ప మరేదీ దొరకలా. ఐతే దాన్ని విసర్జిం చేశాను. తుదకు నాకు నచ్చిన బెంగుళూరంచుగల లక్క రంగు చీర చేతికందింది. కాని దాన్ని విప్పగానే నిర్ఘాంత పోయాను – మధ్యలో జానెడు చిరుగుంది. నా మంచి చీరలన్నీ మాసి పోయాయి. ఇప్పుడేది కట్టుకోవాలి? ఆ భయంకర పులి చారలదా? హాస్యాస్పదమే!" అని నిట్టూర్పు విడిచాను.



"దానిలో నాకేమీ చెరుపనిపించ లేదు విమలా! నేను ఎన్నుకున్న జతలో అదొకటి." అన్నది మా వదిన.

"నా కదంతా తెలీదు. ఇంక మీదట, నేను ధరించుకొనే వాటిని ఇతరులు ఎన్నట వొప్పుకోను." అన్నాను.

సరోజ ఇలా పరిహసించింది: "విమలా నీకు పెళ్లయ్యాక మీ ఆయన కుతూహలంతో నీకో చీర ఎన్ని తెచ్చినా.......

"తప్పకుండా వద్దంటా; నేను ధరించాలిసింది ఎన్నుకొనే నిర్వివాదనీయమైన హక్కు నాదే."

"అది నిజమే నేను వొప్పుకున్నా, ఎన్నుకొనే హక్కు నీదే; వాటిని కాపాడుకొనే హక్కో మరి!" అన్నదామె.

"అదేమిటీ?" నా బుర్ర తిరిగిపోయింది.

ఆమె ఇలా జవాబిచ్చింది:

"ఔను, ఉదాహరణగా, నీవి అనుకొనే బట్టలకోసం నీ కిష్టమైన సబ్బును వాడి వాటిని సరియైన విధానమున ఉతుక్కొనే నీ హక్కును అమలు జరుపు కొంటున్నావా? నీకు ప్రీతైన లక్కరంగు చీర సంగతి చూడు, నీవు సరియైన సబ్బుతో సరియైన విధానమున

S/P. 6A-50 TL

ఉతుక్కొని యుంటే నీ బట్టలను కాపాడుకొని యుందువు గదా!"

"బట్టను కాపాడే సబ్బు ఏమిటి?


"మంచి సబ్బు అంటే శుద్ధమైనది. సమృద్ధియగు గుణవంతమైన నురగను గలిగించునట్టిది — బాదకుండానే బట్టలోని మురికిని బాగుగా తొలగింప గలుగునట్టి నురగ. అటువంటి సబ్బు సన్‌లైట్, అది బట్టలను చిరిగిపోకుండా చాలా కాలము మన్నునట్లు కాపాడగలదు." అన్నదామె.

దాంతో నాకిలా తోచింది: "నా హక్కు. నేను ధరించే బట్టలు నాకిష్టమైన రకము. నేత బద్దింపు. రంగుని ఎన్నుకొనుటలోనే గాక వాటిని కాపాడుకొనుటలోనూ వున్నది కూడాను. నేను ధరించే బట్టలకోసం ఏ సబ్బును వాడాలో నేను గాకుండా మరెవరో నిర్ణయించుట దారుణమే! నిజంగా ఇది విపరీతం!"

నేను నిర్ఘాంత పోయినుంచుంటే మా వదిన చిరునవ్వుతో ఇలా అన్నది: "చింతించకు విమలా! నీకా 'పులిచారల' నమూనా నచ్చకపోతే ఆ బీరువాలో వున్న మూటలో నుంచి నీ కిష్టమైంది ఎన్నుకో"

"ఆ బీరువా చూడగానే విస్తుపోయాను. నా మాసిన బట్టలన్నీ మెరిసే తెల్లని కాంతిమైన





దొంతరగా తయారై వున్నాయి!"

సరోజ అన్నది గదా. "మాసిన బట్టలు ప్రయాణంలో దగ్గిరుంచుకోవడం నాకయిష్టం. నిన్న నా బట్టలుతుక్కునేటప్పుడు నీవికూడా ఉతికాను!"……

*   *   *   *   *

……ఎంతో ఋణపడ్డానే అను ఆశ్చర్యానందభావాలతో, ధరించిన ఆ మెరిసే చీర విప్పలేక నుంచున్నాను. స్టేషన్‌లోంచి రైలు కదిలినప్పుడు ఆమె ఉత్సాహంతో ఊపిన ఆ మెరిసే తెల్లని చేతిరుమాల కళ్లల్లో మెదులుతోంది. ఆకాంతి నిలవుండిపోయింది: అది బీరువాయందలి బట్టల మీద, నేను కట్టుకున్న చీర మీద, నా హృదయంలోను మిలమిల్లాడుతున్నది."

సరోజ తన వస్తువులను పెట్టుకుంటూండే బీరువా మీద ఖాళీస్థలంలో చూస్తే నలుపలకల వస్తువొకటుంది, అది సన్‌లైట్ సబ్బుబిళ్ళే నా? నిస్సంశయంగా అదే! నిజంగా అన్ని ఎక్కువ బట్టలను ఉతికే సబ్బు ఇంకేదీ వుండదనుకుంటాను. అది సమృద్ధయిన నురగను గలిగించుననియు, కొద్ది సన్‌లైట్ చాలా బట్టలను తెల్లగాను కాంతిగాను బాదకుండానే ఉతుకునని, ఈ బిళ్ల బోధించుచున్నది. "అందు చేతనే పొదుపును గలిగించుచూ బట్టలు చాలా కాలము మన్నగలవు.



S/P. 6B-50 TL

బొంబాయిలోని హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ వారి ఉత్పత్తి



అంజలీ చిత్ర

సమర్పించు



ఇందిరా ఫిలిమ్స్

సంగీత నాట్య
సమ్మిళిత మైన
ప్రేమ గాథ







కల్యాణి



దర్శకత్వం ... నీలకంఠన్

సంగీతం ... సత్యం మాటలు-పాటలు ... శ్రీశ్రీ

EAST INDIA
RELEASE

మనోహరమైన

ముఖలావణ్యమునకు





నేషనల్ వారి

కాశ్మీర్ స్నో





సినిమా

తార లందరకు

నచ్చినది

ది నేషనల్ ట్రేడింగ్ కంపెని, బొంబాయి-2 • మదరాసు-1

బాధ నివారణకు సంతోషమగు విధానము





నోవిన్

దక్షిణ ఇండియా ఆఫీసు: 5/149, బ్రాడ్వే, మద్రాసు-1.

రాజ్‌కపూర్ వారి



జిస్ దేశ్ మే గంగా బహతీ హై

 సంగీతం : శంకర్ జైకిషన్ 





చందమామ

సంచాలకుడు : 'చక్రపాణి'

ప్రతిఏడులాగే ఈసారికూడా దీపావళికి ప్రత్యేక ఆకర్షణలూ, బొమ్మలూ, హాస్య చిత్రాలూ, ఎక్కువ పేజీలూ గల సంచికను పాఠకులకు అందజేయటానికి ఆనందిస్తున్నాము.

దీపావళికి సంబంధించిన హాస్య చిత్రాలు నాలుగుపేజీలు వేశాం. "పుట్టినరోజు—పండగ" అనే చిన్న కథ కూడా వేశాం.


త్రివర్ణ చిత్రాలు గల "తెనాలి రామకృష్ణుడి" బొమ్మల కథలు రెండూ, "దీపం ఆత్మకథ", రెండు గోహ బొమ్మల కథలూ కూడా ఈ సంచికలో చూస్తారు.

పైన చెప్పినవన్నీ దీపావళి సంచికకు ప్రత్యేక ఆకర్షణలు. అట్టమీది బొమ్మా, అట్టచివరి బొమ్మా కూడా ఈ సంచికకు ప్రత్యేకంగా తయారుచేసినవే.

ఈసంచిక పాఠకులకు ఆనందాన్ని యిస్తుందని నమ్ముతూ, మా పాఠకులందరికీ దీపావళి శుభాకాంక్షలు అందజేస్తున్నాము.

సంపుటి 27 : నవంబర్ 1960 : సంచిక 5

CHITRA



సైంధవుడు చావగానే కృష్ణార్జునులూ, భీముడూ గొప్ప శంఖనాదాలూ, సింహనాదమూ చేశారు.

భీముడు అర్జునుణ్ణి సమీపించి కర్ణుడు తనకు చేసిన అవమానం గురించి చెప్పాడు. అర్జునుడు అది విని మండిపడి కర్ణుణ్ణి సమీపించి, "ఓరీ, నీచుడా! దైవికంగా నీకు చిక్కిన భీముణ్ణి గురించి అవమానంగా మాట్లాడతావా? చూస్తూ ఉండు, నీ కళ్ళ ఎదటనే నీ కొడుకు వృషసేనుణ్ణి చంపేస్తాను! ఇదే నా ప్రతిజ్ఞ!" అన్నాడు.

ఈ మాటలు వినపడగానే కౌరవ సేనలో హాహాకారాలు లేచాయి. దొమ్మి యుద్ధం ప్రారంభమయింది. మరి కాస్సేపటికి సూర్యుడు అస్తమించాడు. తరవాత కృష్ణార్జునులు తిరుగుముఖమై బయలుదేరారు. ధర్మరాజు వారిని ఆలింగనం చేసుకుని ఆనందాశ్రువులు రాల్చాడు.

అక్కడ దుర్యోధనుడి సంతాపానికి మేర లేదు. ఇందరు యోధులుండి కూడా సైంధవుణ్ణి అర్జునుడినుంచి కాపాడలేకపోయారు. అర్జునుడు ఆరోజు ఏడు అక్షౌహిణీల కౌరవ సేనను నాశనం చేశాడు. భీముడు తన తమ్ములను ముప్పైఒక్కమందిని పొట్టన పెట్టుకున్నాడు. అతను ద్రోణుడివద్దకు వెళ్ళి, "ఆచార్యా, భీష్ముడంతటి యోధుణ్ణి పడగొట్టిన శిఖండి ఇంకా బతికే ఉన్నాడు. నన్ను నమ్ముకుని నాకోసం పోరే మహాయోధులందరూ పోతున్నారు. నీ శిష్యుడని అభిమానించి నీవు అర్జునుణ్ణి ఉపేక్షిస్తున్నావు. ఆ అర్జునుడు ఇవాళ నా సైన్యమంతా నాశనంచేసి సైంధవుణ్ణి చంపాడు. నాకు మిత్రులెవరో తెలియని కారణంచేత ఆపద తెచ్చిపెట్టుకున్నాను!" అని ఎత్తిపొడిచాడు.

ఈ మాటలకు ద్రోణుడు గట్టిగానే సమాధానం చెప్పాడు: "అర్జునుణ్ణి జయించటం



తేలికపని కాదని నీకు ఎన్నోసార్లు చెప్పాను. నేను నీచ బ్రాహ్మణుణ్ణి కనకనే నా కొడుకులలాటి పాండవులను చంపటానికి సిద్ధపడ్డాను. వాళ్ళు ధర్మపరులు. ఇక సైంధవుడిమాట అంటావా? అతనికి మిమ్మల్నందర్నీ రక్షగా పెట్టానుకదా, మీరంతా బతికి ఉండగా అతను ఎలా చావటం జరిగింది? మీరు తగుదుమమ్మా అని అర్జునుణ్ణి ఎందుకు చుట్టుముట్టవలిసి వచ్చింది?"

దుర్యోధనుడు మండిపడి కర్ణుడితో, "చూశావా, మిత్రమా? ద్రోణుడు బుద్ధిపూర్వకంగా అర్జునుణ్ణి మన సేన ప్రవేశించనిచ్చాడు. అందువల్ల సైంధవుడు చావటం జరిగింది. ఈ ద్రోణుణ్ణి నమ్ముకుని నేను సైంధవుణ్ణి ఇంటికి పోకుండా ఆపి అతనికి చావు తెచ్చిపెట్టాను," అన్నాడు.

కర్ణుడు ఈ మాట అంగీకరించక, అర్జునుడు కౌరవసేన ప్రవేశించటంలో ద్రోణుడి తప్పు ఏమీ లేదని చెప్పాడు.

చీకటి పడింది. నక్కలు కూస్తున్నాయి. గుడ్లగూబలు భయంకరంగా అరుస్తున్నాయి. కాని సేనలు యుద్ధం చాలించి శిబిరాలకు తిరిగి పోలేదు. రోషంతో మండిపడిపోతూ దుర్యోధనుడు పాండవసేనలలో ప్రవేశించి భయంకరమైన యుద్ధం చేయసాగాడు.



ద్రోణుడుకూడా గొప్ప యుద్ధం సాగించి కేకయులనూ, ధృష్టద్యుమ్నుడి కొడుకులనూ చంపాడు. శిబి అనేవాడు ఆయన చేతిలో చచ్చాడు. ఉభయపక్షాల యోధులకూ రోషం రెచ్చిపోయింది. పాండవపక్షాన ఘటోత్కచుడూ, అతని రాక్షస సైనికులూ రాత్రి పైబడుతున్నకొద్దీ బలం పొందినవారై అతి భయంకరమైన యుద్ధం సాగించారు. ఘటోత్కచుడి దెబ్బకు తట్టుకోలేక దుర్యోధన కర్ణులవంటి యోధులు వెనుతిరిగారు.

ఆ రాత్రి యుద్ధం ఆరంభమయాక భీముడుకూడా ప్రచండమైన యుద్ధం చేస్తూ, కాళింగుడి కొడుకునూ, పదిమంది

ధృతరాష్ట్ర పుత్రులనూ చంపేశాడు, బాహ్లీకుణ్ణి చంపాడు. పాండవ యోధుల విజృంభణ చూసి దుర్యోధనుడు కర్ణుడితో, "మిత్రమా, ఈ పాండవ సేనల విజృంభణను నీవే అణచాలి!" అన్నాడు. వెంటనే కర్ణుడు ప్రగల్భాలు పలుకుతూ, "రాజా, నీవు విచారించకు. నాకు ఇంద్రుడిచ్చిన శక్తితో అర్జునుణ్ణి తప్పక చంపేస్తాను. ఈ పాండవులనూ, కేకయులనూ, మాత్స్యులనూ, పాంచాలులనూ జయించి భూమండల మంతా ఇచ్చేస్తాను. నీవు చింతించకు!" అన్నాడు.

అది విని కృపుడు వెటకారంగా, "ఎందుకోయి, ఈ ప్రగల్భాలూ? ఇవన్నీ అర్జునుడితో పోరేటప్పుడు ఏమవుతాయి? కార్యశూరులు పనిచేసి చూపుతారుగాని నీలాగా ఆత్మస్తుతి చేసుకోరు," అని ఎత్తిపొడిచాడు. కర్ణుడు ఆగ్రహించి మరింత ప్రగల్భాలాడటమే గాక కృపుడితో, "ఓ బ్రాహ్మడా, నాకు అప్రియంగా మరి మాట్లాడావంటే నా కత్తితో నీ నాలుక కోసేస్తాను!" అన్నాడు.

ఈ మాటలు విని అశ్వత్థామ మండిపడి, "ఓరీ అధముడా! మహావీరుడైన నా మేనమామను పరాభవిస్తావా? నీ తల తెగవేస్తాను!" అని కత్తి ఎత్తాడు. దుర్యోధనుడు అతి కష్టంమీద అశ్వత్థామనూ, కృపుణ్ణీ, కర్ణుణ్ణీ సమాధానపరిచాడు. ఇంతలో పాండవులు కర్ణుణ్ణి చూసి అతనితో యుద్ధానికి వచ్చారు. కర్ణుడు చాలా గొప్పగా యుద్ధం చేశాడుగాని అర్జునుడు తలపడి అతన్ని విరథుణ్ణి చేసేశాడు.

ఆ తరవాత జరిగిన యుద్ధంలో సాత్యకి సోమదత్తుణ్ణి చంపాడు. అంధకారం బాగా హెచ్చిపోయింది. దీపాలు వెలిగించమని దుర్యోధనుడు తన సేనలకు ఉత్తరు విచ్చాడు. కౌరవసేనలో దీపాలు కనబడగానే పాండవుల సేనలో కూడా దీపాలు వెలిగించారు. వాటి వెలుగున యుద్ధం సాగింది.





క్షీరసాగర మథనము.

పంచమాశ్వాసము:

దేవ దైత్యు లిట్లు తరువ
తేలె నొక్క తెలియేనుగు;
అది నాలుగు దంతములది,
ఐరావత మనునట్టిది.

దాని వెంట కల్పమనెడు
తరు వొక్కటి జన్మించెను.
ఈ రెంటిని నా కిండని
ఇంద్రుడు బతిమాలుకొనెను.

"తెల్లని ఈ బొల్లేనుగు
వ్రేళ్ళులేని ఈ మొలకను
ఇంద్రునకే వదలు"డంచు
ఇచ్చినారు దైతేయులు.

తొలుతకంటె వారెల్లరు
బలిమి మెఱసి చిలికినారు—
తఱిగొండొక బొంగరముగ
గిరగిరగిర తిరుగులాడె.

అంత చంద్రుడుదయించెను!
అమృతకాంతు లొలికించెను!
పాలవెల్లిపై చల్లని
పండు వెన్నెలను నించెను!

ఆతని గని దైతేయులు
అమృతభాండమని తలంచి
పట్టుకొనుట కెగురుచుండ,
పకపక నగి రప్సరసలు.

"మీ రెవ్వరు, ఓ భామలు!
క్షీరాబ్ధిని పుట్టినార?
ఓహోహో మీ సొగసులు!
ఒయ్యారము లోహోహో!"

అని పలుకగ అప్సరసలు
అవు నవునని నవ్వుకొనుచు,
వెన్నెలలో తిన్నెలపై
విహరింపగ దొడగినారు.

ఉత్పల సత్యనారాయణాచార్య



వారి అంద చందములను
తీరు తీయములను చూచి,
సయ్యాటల నాడుటకై
చని రెల్లరు దైతేయులు.

అంతలోన కడలినుండి
అవతరించె మహాలక్ష్మి!
పాలవెల్లి వెల్లివొడిచి
బంగరు కెరటాలు లేచె!

దిగ్గజములు బయలువెడలి
దేవి నపుడు జలకమార్చె!
వరుణుండతి భక్తితోడ
వైజయంతిమాల నొసగె!

ఆమె దృష్టి సారించిన
అచ్చోటులు శోభిల్లెను!
ఆమె నవ్వు చిలికించిన
అచ్చోటుల సిరులెసగెను!

పద్మాసనమం దాయమ
పసిడిబొమ్మ లాగుండెను!
ఆమె హస్త పద్మంబుల
అలరు దండ యొకటుండెను!

గరుడునిపై విష్ణుమూర్తి
గ్రక్కున అట కరుదెంచెను;
ఆ పూవుల దండ నామె
అతని మెడలో నుంచెను.



జలదేవత కడలినుండి
వెలువడి, భయభక్తులతో
కౌస్తుభమను రత్నము తన
కానుకగా హరి కొసగెను.

బ్రహ్మాదులు వచ్చి వేద
పఠనం బొనరించినారు;
భక్తితోడ దేవమునులు
ప్రార్థన గావించినారు:

"జయజయజయ మహాలక్ష్మి!
జగజ్జనని! రక్షింపుము!
స్వర్గము మా కిప్పింపుము!
శాపమింక తొలగింపుము!"

అని యింద్రుడు ప్రార్థింపగ
అభయహస్త మిచ్చెనామె;
అంతలోన దేవతలకు
అంతులేని బలము కలిగె!

శ్రీ విష్ణుని వక్షమందు
చేరుకొన్న మహాలక్ష్మి
భక్తజనుల దీవించెను,
భాగ్యములను పాలించెను.

శ్రీ లక్ష్మిని గొని విష్ణువు
పాల కడలిలోని కరిగె;
ఎటనుండియొ శేషుండును
ఏగుదెంచి లోనికేగె—

"రండో!"యని ఆదిత్యులు
రక్కసులను పిలిచినారు;
ఆ పిల్పును విని వారలు
కోపముతో కనలినారు.

అచ్చరలను వదలలేక,
ముచ్చటలను విడువలేక,
ఎట్టకేల కటకు వచ్చి
పట్టి చిలుకదొడగినారు.



అంతలోన ధన్వంతరి
అమృతకలశ మొక్కటి గొని,
పాలకడలినుండి వెడలి
ప్రత్యక్షమ్మయి వచ్చెను!

అతని చేతియందుండిన
అమృత భాండమును కన్గొని,
రా రండని కేకలిడుచు
రక్కసు లరుదెంచినారు.

అమృతముగల స్వర్ణకలశ
మటు నిటు పరికించి చూచి,
ధన్వంతరి చేతి నుండి
దనుజులు తన్నుకపోయిరి.

దైత్యు డొక్కడా ఘటమును
తల దాలిచి గంతులిడెను;
అతనికంటె బలుడొక్కడు
అద్దానిని లాగుకొనెను.

ఒకరొక్కరు అమృతకలశ
మొడిసి పుచ్చుకొనుచుండగ,
తక్కినవా రందఱచట
తాండవింప దొడగినారు.

వారి కాళ్ళ చప్పుడులకు
వజవజమని వణకె భూమి,
వారి చేతి చప్పుడులకు
వ్రక్కలయ్యె నలుదిక్కులు.

"అమృత కలశ మేది, ఏది?"
అని దేవత లరుదేఱగ,
మోటు రక్కసులు వారిని
మోచేతుల పొడిచినారు.

"మీకు చుక్క రానీయము!
మాకే యిది చాల," దనుచు
దైతేయులు దేవతలను
దరిచేరగ నీకుండిరి. —(సశేషం)






11

[ద్రోహి నాగవర్మ సైన్యంతో కోటను సమీపిస్తున్నాడని తెలియగానే చిత్రసేనుడు తన సైనికులను కోటలో దాగి వుండవలసిందిగా ఆజ్ఞాపించాడు. నాగవర్మకు, అతడి వెంటవున్న కరవీరుడనే జ్వాలాద్వీపపు పులిరాయుళ్ల నాయకుడు, తమ భటులను ముందుగా కోటలో ప్రవేశపెట్టి, ఏమి జరుగుతుందో చూడటం మంచిదని సలహా యిచ్చాడు. తరవాత—]

కరవీరుడిచ్చిన సలహా, నాగవర్మకు చాలా బావుందనిపించింది. అందుక్కారణం; అతడిక్కూడా కోటలో ముందుగా ప్రవేశించటానికి భయంగా వుండటమే. నాగవర్మ కూలిపోయిన కోటద్వారంకేసి ఓమారు పరీక్షగా చూసి, తరవాత కరవీరుడికేసి తల తిప్పి, "భలే ఆలోచన. అలాగే చేద్దాం!" అంటూ తన గుర్రాన్ని గిరుక్కున వెనక్కు మళ్ళించి, సైనికులతో, "హేయ్, మీరంతా నిర్భయంగా కోటలో ప్రవేశించవచ్చు. యుద్ధం లేకుండానే మనం కోట ఆక్రమించుకోగలగటం, గొప్ప శుభ సూచన. న్యాయం ధర్మం మన పక్షాన వున్నది గనకే, దేవుడు మన కిలాంటి అవకాశం కల్పించాడు," అని గొంతెత్తి అరిచాడు.

ఆ వెంటనే సైనికులు గుంపులు గుంపులుగా పడిపోయిన కోట ద్వారాలగుండా లోపల ప్రవేశించసాగారు. నాగవర్మా, కర





వీరుడూ గుర్రాలమీద వుండి కత్తి ఝళి పిస్తూ, "ఊఁ, త్వరగా పదండి. కోటగోడలో పడిన కన్నాలనూ, బురుజుల్ని బావుచేసి మనం యుద్ధసన్నద్ధులం కావాలి. త్వరలోనే తారకేశ్వరుడి సైన్యం మనను ముట్టడించ వచ్చు," అని హెచ్చరికలు చేశారు.

సైన్యమంతా కోటలో ప్రవేశించింది. నాగవర్మా, కరవీరుడూ ఓ క్షణకాలం లోపలినుంచి ఏదైనా రణగొణధ్వని వినబడు తుందేమో అని చూసి, అలాంటిదేమీ లేక పోవటంతో, ధైర్యం తెచ్చుకున్నారు.

"మనం అనవసరంగా భయపడ్డాం. కోటలో శత్రువులెవరూ లేరు. ఇక మనం కోట రక్షణలు బలపరుచుకునే ప్రయత్నాలు చేద్దాం," అన్నాడు నాగవర్మ.

కరవీరుడు అవునన్నట్టు తల వూపాడు. ఆ వెంటనే యిద్దరూ కూలిపోయిన కోట ద్వారాలనుంచి గుర్రాలను నడిపించారు. వాళ్లా విధంగా ద్వారాలు దాటి రెండుమూడు గజాలు లోపలికి వెళ్ళారో లేదో, హఠాత్తుగా సైన్యంలో సంక్షోభం పుట్టింది. "రాక్షసులు! రాక్షసులు!" అని గుండె లవిశేలా కేకలు పెడుతూ, కొందరు సైనికులు బయటికి పారి పోయేందుకు పరిగెత్తుకు వస్తున్నారు.

"మోసం, మహారాజా, మోసం! మనం నిలబడి వాళ్లతో యుద్ధం చెయ్యలేం. ప్రాణా లుంటే మరోసారి, వాళ్ళను మట్టుపెట్ట వచ్చు. గుర్రాన్ని వెనక్కు తిప్పండి!" అంటూ కరవీరుడు తన గుర్రాన్ని గిరుక్కున వెనుదిప్పాడు.

"హాఁ ద్రోహం, పిరికిపందలు!" అంటూ నాగవర్మకూడా గుర్రాన్ని వెనక్కు తిప్పి కోటముందున్న మైదానంకేసి దాన్ని పరిగెత్తించాడు.

"ద్రోహి నాగవర్మ పారిపోతున్నాడు! వాడు అడవి చేరేలోపలే పట్టుకోండి!" అన్న చిత్రసేనుడి కేకలు నాగవర్మకు విని పించినై. ఆ వెంటనే రాక్షసుల అట్టహాసాలతో





పాటు, కొన్ని రాతి గదలు రివ్వు రివ్వుమంటూ నాగవర్మా, కరవీరులు ఎక్కిన గుర్రాల పక్కగా దూసుకుపోసాగినై.


"రాక్షసులు మనను ఎలాగూ ప్రాణాలతో పట్టుకోలేమని తెలుసుకుని, చంపేందుకు మనమీదికి రాతి గదలు విసురుతున్నారు, మహారాజా! మనం తొందరగా అడవిని చేరటం మంచిది," అన్నాడు కరవీరుడు భయంతో వణికిపోతూ.

"ఎంత ద్రోహం, ఎంత ద్రోహం!" అంటూ నాగవర్మ పిచ్చివాడిలా కేకలు పెడుతూ గుర్రాన్ని మరింత వేగంగా అడవి కేసి పరిగెత్తించాడు. అంతలో ఉగ్రాక్షుడు విసిరిన రాతి గద ఒకటి, పక్కనే పరిగెత్తి వస్తున్న కరవీరుడి గుర్రాన్ని బలంగా తాకింది. గుర్రం పెద్దగా సకిలించి దఢీమంటూ ముందుకు పడింది. పైనున్న కరవీరుడు కళ్ళెంపట్టు తప్పి, కీచుమని అరిచి, చేతులు అల్లల్లాడిస్తూ, బంతిలా గాలిలోకి ఎగిరాడు.

కరవీరుడు పెట్టిన కేక వింటూనే నాగవర్మ గుర్రాన్ని ఆపి, వెనక్కు తిరిగిచూశాడు. ఉగ్రాక్షుడి రాతిగద దెబ్బకు వెనకకాళ్ళు రెండూ విరగటంతో లేవలేక, కరవీరుడెక్కిన గుర్రం నేలమీద అటూయిటూ దొర్లుతున్నది. అల్లంత దూరంలో చెట్ల పొదలలో పడిన కరవీరుడు, అంతలోనే విల్లంబులా లేచి నిలబడి, "మహారాజా, మహారాజా!" అని అరుస్తూ నాగవర్మకేసి పరిగెత్తుతుంటూ వచ్చాడు.

"మనం యిక్కడ ఏమాత్రం జాగు చేసినా ప్రమాదకరం. మన సైన్యమంతా కోటలోనే నాశనం అయినట్టున్నది. చావగా మిగిలిన కొద్దిమంది మాత్రం మనకేసి పరిగెత్తి వస్తున్నారు," అన్నాడు నాగవర్మ కోటకేసి చూస్తూ.

కరవీరుడుకూడా తల తిప్పి అటుకేసి చూశాడు. కొందరు సైనికులు గగ్గోలుగా





అరుస్తూ అడవికేసి పరిగెత్తుకు వస్తున్నారు. వాళ్ళను వెన్నంటి కొందరు రాక్షసులూ, చిత్రసేనుడి సైనికులూ రావటంకూడా అతడికి కనిపించింది.

"కరవీరా! మనం శత్రువుల నుంచి తప్పించుకు పోగలమా! నువ్వు గుర్రాన్ని కూడా పోగొట్టుకున్నావు," అన్నాడు నాగవర్మ.

"మనం గుర్రాలమీద ఎక్కి పారిపోలేం మహారాజా! శత్రువులు ముఖ్యంగా మనను పట్టుకునేందుకే యింత ఎత్తుగడా వేశారు. కనుక, మనం వాళ్ళ దృష్టిని మరొకవైపుకు మరల్చాలి. ఇదుగో, ఈ వస్తున్న మన భటులిద్దర్నీ గుర్రంమీద ఎక్కించి, అడవిలో వాళ్ళ యిష్టంవచ్చిన వైపుకు పారిపొమ్మనమనండి. శత్రువులు వాళ్లను చూసి తప్పక మనం అని పొరబడి వెంటబడతారు. ఆ సందులో మనం మరోవైపుగా పారిపోవచ్చు," అన్నాడు కరవీరుడు.

కరవీరుడు చెప్పిన ఉపాయం నాగవర్మకు దివ్యంగా కనబడింది. అతడు వెంటనే గుర్రం దిగి, సమీపానికి వచ్చిన తన భటులిద్దర్నీ గుర్రంమీద ఎక్కమని ఆజ్ఞాపించి, వాళ్ళ తలలమీద కరవీరుడి శిరస్త్రాణం, తన శిరస్త్రాణం పెట్టి, "ఒరే, మీరు వెనక్కు తిరిగి చూడకుండా పారిపొండి. అరుగో, రాక్షసులూ, చిత్రసేనుడి సైనికులూ వస్తున్నారు," అంటూ గుర్రాన్ని కత్తి ఒరతో గట్టిగా మోదాడు.

గుర్రం దెబ్బ తింటూనే పెద్దగా సకిలించి, అడవిచెట్ల కిందగా పారిపోసాగింది. నాగవర్మ పెద్దగా నవ్వి, కరవీరుడితో, "కరవీరా! ఇక మనం పారిపోవలసిన దిక్కు ఏది?" అని అడిగాడు.

కరవీరుడు గుంపులు గుంపులుగా అడవికేసి వస్తున్న చిత్రసేనుడి సైనికులకేసి చూశాడు. సైనికుల్లో కొందరు నాగవర్మ భటులెక్కి పారిపోతున్న గుర్రాన్ని చూసి,


CHITRA



"అరుగో, నాగవర్మా, వాడి మిత్రుడు కరవీరుడూ గుర్రంమీద పారిపోతున్నారు, పట్టుకోండి!" అంటూ కేకలు పెట్టారు.

ఆ కేకలు వింటూనే కరవీరుడు చిరునవ్వు నవ్వి, "మన ఎత్తు పారింది. మహారాజా! మనం యిటు పడమటి దిక్కుగా పారిపోవచ్చు," అన్నాడు.

ఆ వెంటనే నాగవర్మా, కరవీరుడూ పొదలచాటున నక్కుతూ, చిత్రసేనుడి సైనికుల కంటబడకుండా క్రమక్రమంగా కీకారణ్యంలోకి పారిపోయారు.

చిత్రసేనుడూ, ఉగ్రాక్షుడూ కోటద్వారం దగ్గిర నిలబడి తమ సైనికులు పట్టి తెచ్చిన శత్రు భటులను, వాళ్ళ నాయకుడెక్కడ అని ప్రశ్నించసాగారు. శత్రుసైనికు లెవరికీ నాగవర్మా, కరవీరులు వేసిన ఎత్తుగడ సంగతిగానీ, క్షేమంగా వాళ్ళు అడివిలోకి పారిపోయిన విషయంగానీ తెలీదు. గుర్రాన్ని ఎక్కి పారిపోయే శత్రుభటులను చూసి నాగవర్మా, కరవీరుడూ అని భ్రమపడి వెంటబడిన సైనికులు కొంతసేపటికి తిరిగివచ్చి, అడవిలో వాళ్ళెక్కడో మాయమయారని చిత్రసేనుడితో చెప్పారు.

"ఇంతకీ ఆ ద్రోహి నాగవర్మ మనచేతిలో పడకుండా పారిపోగలిగాడు!" అన్నాడు చిత్రసేనుడు ఎంతో నిస్పృహగా.

"మహారాజా, ఆ నాగవర్మనూ, వాడి వెంట వున్న పులిరాయుడు కరవీరుణ్ణీ పట్టుకునే పని నాకు వదలండి. ఇప్పుడే నా బంట్లను అడవి అంతా గాలించేందుకు పంపుతాను," అన్నాడు ఉగ్రాక్షుడు. అతడు ఆజ్ఞాపించగానే కొందరు రాక్షసులు చేతికి దొరికిన ఆయుధమల్లా పట్టుకుని అడవిలో నలుమూలలకూ పరిగెత్తారు.

ఆ తరవాత కొంతసేపటికి చిత్రసేనుడు తన తండ్రికి సహాయంగా పంపిన సేనానాయకుడూ, ఆ వెనకగా తారకేశ్వరుడూ సైన్యాలతో సహా వచ్చారు. తన కుమారుడు



ఎవరి సహాయం లేకుండానే కపిలపురం కోటను పట్టుకున్న సంగతి విని తారకేశ్వర మహారాజు చాలా సంతోషించాడు. కాని, నాగవర్మ ప్రాణాలతో పారిపోవటం అతడికి బాధ కలిగించింది.

"ఆ ద్రోహి బ్రతికివుండటం మనకెప్పటికి ప్రమాదకరమే. వాడికీ, జ్వాలాద్వీపపు పులిరాయుళ్ళకూ వున్న స్నేహ సంబంధాల వల్ల, ఏదో ఒకనాడు వాళ్ళు భయంకర పక్షులతో మనమీద దాడి చేయటానికి ప్రయత్నించకపోరు," అన్నాడాయన.

ఈ భయం అక్కడున్న ప్రతి ఒక్కరికీ వుండనేవున్నది. అందరూ ఉగ్రాక్షుడు పంపిన రాక్షసబంట్లు ఆ ద్రోహులిద్దరినీ పట్టి తేగలరని ఆశపెట్టుకున్నారు.

కపిలపురం రాజు వీరసింహుడికి, చిత్రసేనుడు తన తండ్రిని పరిచయం చేశాడు. వీరసింహుడు తనకు చిత్రసేనుడు చేసిన సహాయం సంగతి తారకేశ్వరుడితో చెప్పి, "ఇక నేను రాజ్యపాలనా భారం వదులుకోదలిచాను. నాకు పుత్రులు లేరు. ఉన్నది ఒక్కగానొక్క కుమార్తె. మీతో వియ్యమందాలని వున్నది," అన్నాడు.

తారకేశ్వరుడు అంతకు పూర్వమే రాకుమార్తె కాంతిమతిని చూశాడు. చిత్రసేనుడు



ఆమెను ప్రేమించివున్నట్టు కూడా సైనికుల సంభాషణనుబట్టి గ్రహించాడు. ఒక్క దెబ్బతో తన కుమారుడు ప్రేమించిన రాకుమార్తెను వివాహమాడటమే గాక, తన రాజ్యాన్నికూడా రెండింతలు చేసుకోగలడు. ఈ కారణాలవల్ల తారకేశ్వరుడు చిత్రసేన కాంతిమతుల వివాహానికి వెంటనే అంగీకారం తెలియపరిచాడు.

త్వరలోనే వివాహ ముహూర్తం నిర్ణయింపబడింది. వివాహంరోజున చిత్రసేనుడు సైనికులకూ, సేనానాయకులకూ బహుమానాలిచ్చాడు. అతడు ముఖ్యంగా తనకు మొదటినుండి ఎన్నోవిధాల సహాయపడిన,

ఉగ్రాక్షుడికి ఏదైనా విలువైన బహుమానం యివ్వాలనుకున్నాడు.

"ఉగ్రాక్ష, నువ్వు నాకు చేసిన సహాయం అమూల్యమైనది. నేనూ, కాంతిమతీకూడా నీకు చాలా కృతజ్ఞులం. ఈ వివాహ సందర్భంలో నీకు ఎలాంటి బహుమానం కావాలో కోరుకో," అన్నాడు చిత్రసేనుడు.

"మహారాజా, మీరు మరోసారి ఆలోచించుకుని వాగ్దానం చెయ్యండి. నేను కోరబోయే బహుమానం మీకు కష్టం కలిగించవచ్చు," అన్నాడు ఉగ్రాక్షుడు.


"అలాంటిదేం వుండదు, కోరుకో!" అన్నాడు చిత్రసేనుడు.

"మహారాజా, నేను మిమ్మల్ని మొట్టమొదటగా కోరిన కోర్కె, మీకు పుట్టబోయే పిల్లల్లో పెద్దవాణ్ణి పద్దెనిమిదో ఏడు రాగానే నా పరం చెయ్యమని. కాని, కొన్ని కారణాల వల్ల నా మనస్సు మార్చుకున్నాను. ఇప్పుడు నేను కోరేదేమిటంటే, మీకు పుట్టబోయే ప్రథమ సంతానం మొగపిల్లవాడైనా, ఆడపిల్ల అయినా సరే—అయిదో ఏటనే నా పరం చెయ్యాలని," అన్నాడు ఉగ్రాక్షుడు.

ఈ కోరిక వింటూనే చిత్రసేనుడు నిర్విణ్ణుడయాడు. కాని, అంతలోనే అతడికి ఒక ఆలోచన వచ్చింది. తన ప్రథమ సంతానాన్ని ఏదో ఒకనాడు రాక్షసుడికి ఒప్పచెప్పవలసిరావటం తప్పనప్పుడు—అది పద్దెనిమిదో ఏట అయితేనేం? అయిదో ఏట అయితేనేం?

"ఉగ్రాక్ష, నువ్వు కోరిన విధంగానే జరుగుతుంది," అన్నాడు చిత్రసేనుడు.

చిత్రసేనుడి మాటలు వింటూనే ఉగ్రాక్షుడు ఎక్కడలేని ఆనందంతో ఉప్పొంగిపోతూ, "మహారాజా, నేను సర్వదా తమ దాసానదాసుణ్ణి!" అంటూ అతడికి ప్రణమిల్లి లేచి, తన సేవకులకేసి తిరిగి, "ఒరే, బంట్లూ, అంతా యిక్కడే వున్నారా?" అని హుంకరించాడు. —(ఇంకా వుంది)





పుట్టినరోజు — పండగ

రేపు నరక చతుర్దశి అనగా సాయంకాలం బండికి అక్కా, బావా వచ్చారు.

"గోపీ, అక్కా బావా వచ్చార్రోయ్!" అని అమ్మ కేకపెట్టింది.

దక్షిణపు గదిలో నవారుమంచం మీద బోర్లపడుకున్న అయిదేళ్ల గోపీ జవాబు చెప్పలేదు.

"ఏడీ వాడూ? బయటికి రాడేం?" అన్నాడు నాన్న.

"నేన్రాను ఫో!" అన్న గోపీ గొంతు అస్పష్టంగా వినపడింది.

అక్కా బావా కాళ్ళు కడుక్కున్నారు. రైలు ప్రయాణం సుఖంగానే జరిగిందన్నారు. కుశలప్రశ్నలు అయాయి.

"గోపీగాడు ఎందుకో అలిగినట్టుందే!" అన్నాడు బావ.

"ఎందు కడుగుతావు, నాయనా! ప్రతి దానికీ ఏదో పేచీ వేస్తాడు. ప్రాణాలు కొరికేస్తున్నాడంటే నమ్ము!" అన్నది అమ్మ.

"ఏమంటాడూ?" అన్నది అక్క.

"వాడి మొహం! ఈసారి వాడి పుట్టిన రోజు పండగలో పడిపోయిందిట. రెండూ చెయ్యాలిట!" అన్నాడు నాన్న.

"అవును మరీ! రెండూ కలిపే చేసుకోవాలి!" అన్నాడు బావ.

"అదేం కుదరదు! దేనికదిగా చెయ్యాల్సిందే!" అంటూ గోపీ, ముచ్చులా మొహం పెట్టుకుని, లాగు ఎగలాక్కుంటూ గదిలో నుంచి ఊడిపడ్డాడు.

గోపీ చాలా కోపంలో ఉన్నాడు. అక్క దగ్గిరికి తీసుకోబోతే మొహం ముడుచుకుని ఆమె చెయ్యి తోసేశాడు.

"గోపీ, రెండూ చేసుకునేటందుకు నేను మంచి ఉపాయం చెబుతాను. రేపు నీ





పుట్టినరోజూ, ఎల్లుండి దీపావళీ చేసుకుందాం ఏం?" అన్నాడు బావ.

"మరి నరకచతుర్దశి పండగో?" అన్నాడు గోపీ.

"పోనీ ఒక పని చెయ్యరా, గోపీ! రేపు రెండు జతల కొత్తబట్టలు కట్టుకో!" అన్నది అక్క.

"రెండు జతలూ కుట్టించారే, తల్లీ! అది చాలదుట!" అన్నది అమ్మ.

"అవునండీ, ఎలా చాలుతుందీ? వాడికి రేపు తెల్లారుజామున రెండు తలంట్లు పొయ్యండి—ఒకటి పుట్టినరోజుకూ, ఇంకోటి పండగకూ!" అన్నాడు బావ.

"అట్లాగే అప్పచ్చులు కూడా రెండింతలు తింటే సరిపోతుంది!" అన్నది అక్క.

అందరూ నవ్వారు. గోపీకి రోషంవచ్చింది. "అదేంవల్లకాదు! అదేంవల్లకాదు!" అన్నాడు వాడు కోపంగా.

"ఇంకేం చెయ్యమంటావురా?" అన్నాడు నాన్న విసిగి.

"నాకు పండగా పుట్టినరోజూ రెండూ కావాలి," అన్నాడు గోపీ మొండికెత్తి.

"అందుకు ఏం చెయ్యమంటావో చెప్పు, అలాగే చేద్దాం," అన్నది అమ్మ.

గోపీ సమాధానం చెప్పలేదు. పండగా, పుట్టినరోజూ కలిసిరావటంతో తనకు పెద్ద మోసం జరిగిందని వాడికి తోచింది. ఏం చేస్తే ఈ అన్యాయం సరిఅవుతుందో వాడికి తెలీదు.

"చూడు, గోపీ, మేం ఈసారి పండగకి రాలేదు, నీ పుట్టినరోజు అనే వచ్చాం," అన్నది అక్క.

"ఈ యేడు నీ పుట్టినరోజు అందరూ చేసుకుంటున్నారు! ఎంత గొప్ప!" అన్నాడు బావ.

ఎంతమంది ఎన్నివిధాల చెప్పినా గోపీ మనసు సమాధానపడలేదు.

"వాడికేదో భూతం పట్టింది. వాణ్ణి వది లెయ్యండి!" అన్నాడు నాన్న.





టపాకాయల చప్పుళ్లకు గోపీ నిద్ర లేచాడు. రకరకాల మోతలు అన్నివైపుల నుంచీ వినవస్తున్నాయి. ఇంకా చీకటిగానే ఉంది. అయినా అప్పుడే పిల్లలు తలంట్లు పోసుకుని, కొత్తబట్టలు కట్టుకుని టపాకాయలు కాలుస్తున్నారు. గోపీకి టపాకాయ మందు వాసన కూడా కొట్టింది. అంతలోనే అక్క వచ్చి, "గోపీ, నిద్ర లేచావా? లేచి మొహం కడుక్కో, నువుకూడా తలంటు కుందువుగాని," అన్నది.

"నాకేమీ అక్కర్లేదు ఫో!" అన్నాడు గోపీ. వాడి తిక్క ఇంకా దిగలేదు.

నెత్తిమీద నూనె మర్దన చేసుకుంటూ బావ వచ్చి, "చూడు, గోపీ! మంకుపట్టు పట్టావంటే నీకు పుట్టినరోజూ ఉండదు, పండగా ఉండదు. లేచి తలంటుకో, నీకే దైనా మంచి పుట్టిన రోజు బహుమానం తెస్తాను," అన్నాడు.

గోపీ మూతి ముడుచుకునే తలంటి పోయించుకున్నాడు, కొత్త బట్టలు కట్టు కున్నాడు, టపాకాయలు బావ కాలిస్తే తాను చూసి ఆనందించాడు. ఆనందించేటప్పుడు కూడా వాడి మొహం విప్పారలేదు.

బజారుకు వెళ్లి బావ వాడికి ఒక సిల్కు రుమాలు తెచ్చాడు. గోపీ దానికేసి కోపంగా చూసి బావ చేతిలోనుంచి లాగేసుకున్నాడు —కాని ఆనందం కనబరచలేదు.

గోపీకి ఏంచెయ్యటానికీ తోచలేదు. వాడికి ఒంటరిగా ఉండాలనిపించింది. వంటింటో





అమ్మ వంట చేస్తున్నది. నట్టింటో నాన్న కూచుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. ముందు వసారాలో బావ పత్రిక చదువుతున్నాడు.

గోపీ గదిలోకి వెళ్ళాడు. అక్క మంచం మీద బోర్లా పడుకుని ఏదో పత్రిక చదువుతున్నది. ఇంకెక్కడికైనా పోదామనుకుంటుండగా అక్క పేజీ తిప్పింది. అందులో రంగుల బొమ్మ కనిపించింది.

గోపీ చల్లగా అక్కదగ్గిరికి వచ్చి కూచున్నాడు. పత్రికలో కనిపించిన బొమ్మలకేసి చాలాసేపు చూశాడు.

"ఏమిటక్కా అదీ?" అన్నాడు గోపీ.

"ఏదో కథ," అన్నది అక్క పరధ్యానంగా.

"నేను బొమ్మలు చూసి ఇవ్వనా?" అన్నాడు గోపీ బతిమాలుతున్నట్టుగా.

అక్క పత్రికను వాడి చేతికిచ్చి, వంటింటో తల్లికి సాయం కావాలేమోనని చూడబోయింది. అక్క ఒక అరగంటకు తిరిగి వచ్చేలోపల గోపీ పత్రికను మూడు సార్లు తిరగేసి బొమ్మలన్నీ మళ్ళీ మళ్ళీ చూశాడు. ఆ తరవాత వాడు అక్కచేత కథలన్నీ చదివించుకున్నాడు.

గోపీ తిక్క పూర్తిగా దిగిపోయింది. వాడిలో కలిగిన మార్పుకు అందరూ ఆశ్చర్యపడ్డారు.

గోపీలో ఇంత మార్పు తెచ్చిన ఆ బొమ్మల పత్రిక ఏమిటై ఉంటుందంటారు?





ఏవండోయ్—ఆ గండాగండి. వీడు మీ సిగరెట్లపెట్లో సీవం టపాకాయలు దాచుకున్నాట్ట!



పిల్లా—నే నిప్పుడు ఔటు పేలుస్తాను. ఔట్లు పెద్దవాళ్ళే పేల్చాలిగా—అందుకని మీసాల బొమ్మేసుకున్నానన్నమాట.



అమ్మా! అమ్మా! మరేం, నాన్న నల్ల కళ్ల జోడూ, నా మూడుచక్రాల సైకిలూ, ముంజికాయబండీ యిచ్చేస్తే, కొట్టువాడు ఎన్ని టపాసు లిచ్చాడో చూడు.




మా తమ్ముణ్ణి ముద్దెట్టుకుందికి టిక్కెట్లు యిక్కడ అమ్మబడును. ఒక్క టిక్కట్టు వెల మూడు టపాసులూ, ప్రతి మతాబాలూ—












నాన్నా! మీ ఆవిడ అబద్ధాలు చెబుతుంది గానీ వినకు. టపాకాయలు ఎండబెట్టి వుంటే, నేను ఒక్కటే అంటించాను. మిగతావి వాటంతటవే కాలిపోయాయి—



రేయ్ గోపీ! వాటిలో సగంవాటా మర్యాదగా నాకియ్యి. లేపోతే మా అక్కయ్యని పిల్చి పాడమంటానంతే. అప్పుడు నీ టపాకాయల చప్పుడు అస్సలు వినబడదు.

బావగారి ప్రతాపం












అక్కయ్య తలుపుచాటున దాంకుంది. బావ ఎంత పిలిచినా పలకలేదు. అపుడు
రంగడికి ఒక అణాయిస్తే, అక్కయ్య ఎగ్గిరి గంతేసి అవతలకి వచ్చింది.



యావండీ, యావండీ, బాబయ్యగారూ మరే
మోనేం మా బామ్మగారేమోనూ మిమ్మల్నీ
ప్పది మతాబాలూనూ, ఇరవై ఫది టపా
సులూ అప్పు అడిగి తెచ్చి పెట్టమందండీ...



“చెల్లాయ్! కొత్తరకం లెక్క చెప్తా చేస్తావా?
ఒక ఎండలో ఫది టపాసులూ, యాభై
మతాబాలూ, ఎండబెట్టారు. అక్కడ చిచ్చు
బుడ్డి కాల్చేస్తే, ఎన్ని మిగుల్తాయ్ చెప్పు—”

నేరానికి బహుమానం!

విసుగుచెందని విక్రమార్కుడు తిరిగి చెట్టు వద్దకు వెళ్ళి, శవాన్ని దించి భుజాన వేసుకుని, ఎప్పటిలాగే మౌనంగా శ్మశానంకేసి నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు, "రాజా, నీవు పైన వేసుకున్న పనిని కొనసాగించటంలో ఇంత పట్టుదల చూపుతున్నావుగదా, నీ పట్టుదలకు ప్రేరణ ఎక్కడినుంచి వస్తున్నదీ నాకు బోధపడటంలేదు. సాధారణంగా అంతరాత్మ ప్రేరణకు గురి అయినవాళ్ళు కార్యసాధనలో అంతులేని దీక్ష ప్రదర్శిస్తారు. కాని అలాంటి వారిలో కూడా చాలామంది రామభద్రుడిలాగా తమ దీక్షను మధ్యలోనే విడిచిపుచ్చుతారు. నీవుమాత్రం ఎంతకూ నీ పట్టు విడవకుండా ఉన్నావే. నీకు శ్రమ తెలియకుండా ఉండగలందులకు ఆ రామభద్రుడి కథ చెబుతాను విను," అంటూ ఈ విధంగా చెప్పసాగాడు:

బేతాళ కథలు





అయోధ్యానగరంలో రామభద్రుడనే క్షత్రియ యువకుడుండేవాడు. అతను బొత్తిగా ఏ ఆధారమూ లేనివాడు. అందుచేత ఎవరివద్దనైనా కొలువు చేసుకుని బతుకుతూ వచ్చాడు. అటువంటి పనికూడా అతనికి నిలకడగా ఒకటీ కుదరలేదు. దారిద్ర్యదేవత అతన్ని వెన్నంటే తిరుగుతున్నది. ఇలా ఉండగా రామభద్రుడికి ఒక కొత్త పని దొరికింది. అయోధ్యకు చాలా దగ్గరలోనే ఒక వృద్ధ క్షత్రియుడుండేవాడు. ఆయన పేరు విరూపాక్షుడు. ఆయన ఎంతో సంపన్నుడై ఉండికూడా ముసలితనంలో మోడుపడిన చెట్టులాగా అయిపోయాడు. ఆయనకుండిన ఒక్క కొడుకూ మరణించాడు. ఇక దగ్గరబంధువు లెవరూ లేరు.

ఈ విరూపాక్షుడు చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రాత్రింబగళ్లు ఆయనను కనిపెట్టి ఉండి పరిచర్యలు చెయ్యటానికి ఒక మనిషి కావాలి. పరిచర్య చేసేవాణ్ణి ఇంట్లోనే పెట్టుకుని మంచి జీతం కూడా ఇస్తారు.

రామభద్రుడికి ఇది మంచి ఉద్యోగమే. కాని ఆ విరూపాక్షుడు అమిత కోపిష్ఠి అనీ, ఆయనకింద ఒక్క పూట పనిచెయ్యటం కూడా ఎంతో కష్టమనీ, ఆయనకు రోగం వచ్చిన తరవాత ఎంతోమంది పనిలోకి వచ్చి, ఆయనచేత తన్నులూ, తిట్లూ, శాపనార్థాలూ పడలేక పని మానుకుని వెళ్ళిపోయారనీ రామభద్రుడు విన్నాడు.

"అసలే రోగి, అందులోనూ ముసలివాడు. నాకు తగినంత సహనం ఉండి ఆయన చెప్పినట్టల్లా చేస్తే ఆయన ఏమీ అనడు," అనుకుని రామభద్రుడు విరూపాక్షుడికి సేవ చెయ్యటానికి సమ్మతించాడు.

అయితే రామభద్రుడికి ఈ పని మానవమాత్రులవల్ల అయేపని కాదని త్వరలోనే తెలియవచ్చింది. విరూపాక్షుడు చాలా దుర్మార్గుడు. ఆయన కోపం వెర్రికోపం. తనకు సేవ

ఏమాత్రం సరిగా జరగలేదని తోచినా నోటికి వచ్చినట్టు తిట్టేస్తాడు, చేతిలో ఏది ఉంటే అది గిరవాటు వేస్తాడు.

ఆయన రామభద్రుణ్ణి ఏదో మిషమీద అస్తమానం తిట్టి, శాపనార్థాలు పెట్టేవాడు, ఒక్కొక్కప్పుడు కర్ర తీసుకుని కొట్టేవాడు; అతణ్ణి మనిషిలాగా చూసేవాడే కాడు; అమిత క్రూరంగానూ, రాక్షసుడులాగానూ ప్రవర్తించేవాడు.

ఒకనాడు రామభద్రుడు తన యజమాని చేత తన్నులు తిని, ప్రాణం విసిగి, వెళ్ళి పోవటానికి మూటా ముల్లె సద్దుకోసాగాడు. విరూపాక్షుడు కాళ్ళబేరానికి వచ్చి, "అంత కోపం దేనికిరా? వెళ్లిపోవద్దురా! నేనింకా ఎంతోకాలం బతకనురా! నేను కళ్లుమూసే దాకా ఎలాగైనా నన్ను కనిపెట్టి ఉండక పోతే దిక్కులేని చావు చస్తానురా!" అని బతిమాలాడు.

రామభద్రుడు మెత్తబడి, తన మనసు మార్చుకుని, ఉండిపోయాడు. కాని విరూపాక్షుడు కొంచెంకూడా మారలేదు. రామభద్రుడికి చివాట్లూ, శాపనార్థాలూ మరింత ఎక్కువ అయాయి.

గ్రామంలో ఉండే పెద్దలు అప్పుడప్పుడూ వచ్చి విరూపాక్షుణ్ణి చూసి, ఆయనతో అవీ



ఇవీ మాట్లాడి, వెళ్ళేటప్పుడు రామభద్రుడితో, "బాబూ, ఆ ముసలివాణ్ణి నాలుగు రోజులపాటు జాగర్తగా కనిపెట్టి ఉండు. వెనకటి నౌకర్లలాగా కాక నువు కాస్త బుద్ధి మంతుడివిలాగున్నావు!" అనేవాళ్ళు.

అప్పుడప్పుడూ వైద్యుడు వచ్చి చూసి మందిచ్చి, దాన్ని ఏయే వేళలప్పుడు, ఏయే అనుపానాలతో ఇవ్వాలో రామభద్రుడికి చెప్పేవాడు.

మిగతా సమయాల్లో రామభద్రుడికి తన యజమాని దౌర్జన్యం భరించటం తప్ప మరొక అనుభవం ఉండేదికాదు. అతనికి స్వేచ్ఛ అనేది ఎట్లా ఉంటుందో జ్ఞాపకం


రాకుండా పోయింది. ఏ రాక్షసుడి గుహలోనో బందీగా చిక్కినట్టుగా అతను బాధపడేవాడు.

ఈ బాధతోనే ఒక ఏడాది గడిచింది. రామభద్రుడికి అయోధ్యానగరం వెళ్లాలనే కోరిక నానాటికీ తీవ్రమయింది. అతన్ని విరూపాక్షుడు తలలో పుండులాగా సలుపుతున్నాడు. అది అలా ఉంచి, అతనికి రావలిసిన జీతం అయిదువందల వరహాలు పేరుకుని ఉన్నాయి. వాటితో తాను ఎన్ని సుఖాలైనా అనుభవించవచ్చు.

విరూపాక్షుడి ఇంటికి అప్పుడప్పుడూ వచ్చే పెద్దలతో రామభద్రుడు, "బాబూ, నేను వెళ్ళిపోదామనుకుంటున్నాను. బాబుగారికి సేవ చెయ్యటానికి మరొకణ్ణి ఏర్పాటు చేయించండి," అన్నాడు.

"ఒరే, నాయనా, ఈ వానాకాలం గడిచేదాకా ఓపిక పట్టి ఉండు, ఇంతకాలం ఉండనే ఉన్నావు. మీ యజమానికి ఈ మూడు నెలలూ గడిస్తే తరవాత ఇంకొకణ్ణి పెట్టటం సంగతి చూద్దాం," అన్నారు విరూపాక్షుడి మిత్రులు.

రామభద్రుడు సరేనన్నాడు. కాని ఆరోజుకారోజు గడుస్తున్నకొద్దీ వాడి వేదన హెచ్చిపోతున్నది. విరూపాక్షుడి సేవలో వాడు చితికి నజ్జుయిపోతున్నాడు. వాడి మనస్సంతా మారిపోయింది. ఇప్పుడు వాడికి తన యజ



మాని వయస్సు చూసి గౌరవంగాని, రోగం చూసి జాలికాని లేదు. తాను మంచి జీతం తెచ్చుకుంటున్నానన్న తృప్తికూడా ఏమీ లేదు. విరూపాక్షుడి నుంచి తెంచుకుని ఎప్పుడు పోదామా అన్న ఆరాటం తప్ప వాడికి మరేదీ లేదు.

చివరకు వాడు ఎంత తెగబడ్డాడంటే తనకు రావలిసిన డబ్బు కూడా వదులుకుని ఏ రాత్రివేళో ఎవరితోనూ చెప్పకుండా పారి పోదామనుకున్నాడు. కాని ఇంతలోనే ఒకటి జరిగింది: ఒకనాడు విరూపాక్షుడు గ్రామాధి కారిని పిలిపించి రహస్యంగా ఆయన చేతిలో ఒక పత్రం పెట్టాడు.

అది ఆయన మరణ శాసనం. తన అనంతరం తన ఆస్తి ఎవరెవరికి చెందాలో ఆ పత్రంలో ఉంది.

ఈ సంగతి తెలిశాక రామభద్రుడు, "ఇక ఈ ముసలివాడు అట్టేకాలం బతకడు. ఇన్నాళ్లు ఈ నరకం భరించి ఇప్పుడు పారిపోతే నలుగురూ నన్ను ఏమంటారో! ఇంకా కొద్దిరోజులు ఈ బాధలన్నీ భరిస్తాను," అనుకున్నాడు.

కొద్దిరోజులు గడిచాయి. విరూపాక్షుడి సేవలో రామభద్రుడికి సరిగా నిద్రే లేదు. రాత్రివేళ రెండుసార్లు ఔషధం ఇవ్వాలి. మధ్యకాలంలో కూడా రామభద్రుడు కన్ను



మూయగానే ముసలివాడు ఏదో ఒక వంక పెట్టి లేపుతూంటాడు.

ఒక రాత్రి రామభద్రుడు తన యజమాని పెట్టిన కేకకు లేవలేదు. విరూపాక్షుడు కోపావేశంలో వెర్రివాడులాగా అయిపోయి తన మంచం పక్కనే ఉన్న నీళ్ళచెంబు రామభద్రుడి తలకేసి విసిరాడు.

రామభద్రుడు నిద్రమత్తులోనుంచి తుళ్ళిపడి లేచాడు. ఒక క్షణంపాటు వాడికి తలపైన అయిన గాయం బాధా, మొహంనిండా తడీ తప్ప మరేమీ తెలియలేదు. ఆ తరవాత తన యజమాని తిట్టుతూ ఉండటం వినిపించింది. రామభద్రుడికి కోపంతో ఒళ్ళు తెలియలేదు. వాడు ఒక్క దూకున వెళ్ళి విరూపాక్షుడి మొహాన్ని రెండుచేతులా గట్టిగా మూశాడు. విరూపాక్షుడు కొద్దిసేపు గిలగిలా కొట్టుకుని నిశ్చలంగా ఉండిపోయాడు.

తన యజమాని చచ్చిపోయాడని రామభద్రుడికి వెంటనే అర్థం కాలేదు. అర్థమయాక వాడు నలుగురినీ పిలుచుకు వచ్చాడు. కొంచెం ఆలస్యంగా వైద్యుడు కూడా వచ్చాడు. "ఎప్పుడో పోవలసినవాడు! గట్టి ప్రాణం కనక ఇంతకాలం బతికాడు!" అన్నారందరూ.

ఒక్కరుకూడా రామభద్రుడు హత్య చేశాడని అనుకోలేదు. వాడుమాత్రం పశ్చాత్తా



పంతో కుమిలిపోసాగాడు. వాడి విచారం చూసి అందరూ అదంతా వాడి స్వామిభక్తి అని అనుకున్నారు.

గ్రామాధికారి పెద్దలందరి ఎదటా విరూపాకుడి మరణ శాసనం చదివాడు. విరూపాకుడు తన యావదాస్తీ రామభద్రుడి పేర రాసేశాడు!

ఈ సంగతి తెలియగానే రామభద్రుడి మనసు మరింత క్షోభపడింది. విరూపాకుడి సొత్తు చిల్లిగవ్వకూడా తాను ముట్టుకో రాదనుకున్నాడు. "ఈ సొత్తు నాకు వద్దు," అంటే అందరూ కారణాలు అడుగుతారు. తాను హత్య చేసిన సంగతి బయట పడుతుంది. అందుచేత విరూపాకుడి ఆస్తి తీసుకుని దాన్ని రహస్యంగా బీదలకూ, దైవ కార్యాలకూ పంచిపెట్టి తన దారిన తాను పోదామనుకున్నాడు.

రామభద్రుడికి ఇంత ఆస్తి వచ్చినందుకు గ్రామంలో ఎవరూ అసూయపడలేదు. "ఆ రామభద్రుడు మనిషికాదు, దేవుడు! లేకపోతే ఆ కర్కోటకుడికి ఇంకెవరు అలా సేవచేస్తారు? ఎంత దుర్మార్గుడు! ఎటువంటి రాక్షసుడు! అటువంటివాణ్ణి రామభద్రుడు చివరిదాకా అంటిపెట్టుకుని ఉన్నాడంటే అది నిజంగా మరొకరివల్ల అయేపని కాదు!" అని అందరూ రామభద్రుణ్ణి మెచ్చుకున్నారు.



అందరూ తన యజమానిని నానా మాటలూ అంటూంటే రామభద్రుడు అయనను వెనకవేసుకుని వచ్చి, "అయన మాట పెళుసుగాని మనసు చాలా మంచిది!" అని సమర్థించవలసివచ్చింది. గ్రామస్తులు రామభద్రుణ్ణి మరింతగా మెచ్చుకున్నారు.

కొద్దికాలానికి రామభద్రుడి మనసు చిత్రంగా మారిపోయింది. అతను తనకు సంక్రమించిన ఆస్తిని దానధర్మాలకింద ఖర్చుచేసే ఆలోచన మానేసి, పెళ్ళి చేసుకుని, ఆ గ్రామంలోనే భార్యా బిడ్డలతో సుఖంగా కాపరం చేశాడు.

బేతాళుడీకథ చెప్పి, "రాజా, హత్య చేశానని బాధపడిన రామభద్రుడి మనసు మారటానికి కారణమేమిటి? వాడు తాను చేసినది మంచిపని అనుకున్నాడా? లేక, డబ్బుపై గల వ్యామోహం వాడి అంతరాత్మను జోకొట్టిందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసికూడా చెప్పకపోయావో నీ తల పగిలిపోతుంది," అన్నాడు.

దానికి విక్రమార్కుడు, "రామభద్రుడు బుద్ధిపూర్వకంగా హత్య చేయలేదు. విరూపాక్షుడి సేవలో వాడి బుద్ధి నలిగిపోయి అది ఏనాడో వశం తప్పింది. అయితే వాడి అంతరాత్మ మటుకు వాడు హత్యచేశాడని నిర్ణయించి తీర్పు చెప్పింది. అందుచేత వాడు మానసికంగా బాధపడ్డాడు. అయితే అంతరాత్మ నిర్ణయంకన్న బలవత్తరమైనది లోకం యొక్క నిర్ణయం. లోకం వాణ్ణి సజ్జనుడని తీర్పు ఇచ్చింది. అందువల్ల అంతరాత్మ ఇచ్చిన తీర్పు తుడిచిపెట్టుకు పోయింది. వాడు తిరిగి మనశ్శాంతి పొంది మామూలు మనిషిలాగా జీవితం గడిపాడు," అన్నాడు.

రాజుకు ఈవిధంగా మౌనభంగం కలగగానే బేతాళుడు శవంతోసహా మాయమై మళ్ళీ చెట్టెక్కాడు. —(కల్పితం)





సింహళదేశపు రాజైన విక్రమబాహువుకు రత్నావళి అనే కుమార్తె ఉండేది. ఆమెను పెళ్ళాడినవాడు సార్వభౌముడౌతాడని ఒక సిద్ధుడి ద్వారా యౌగంధరాయణుడికి తెలిసింది. యౌగంధరాయణుడు వత్సరాజైన ఉదయన మహారాజుకు మంత్రి, రాజు యొక్క శ్రేయస్సు కోరినవాడు. అందుచేత ఆయన, "మీ కుమార్తెను ఉదయన మహారాజు కిచ్చి వివాహం చేయండి," అని సింహళ రాజుకు కబురు పంపాడు.

అయితే సింహళరాజు ఉదయన మహారాజు భార్య అయిన వాసవదత్తాదేవికి పినతండ్రి. తన కుమార్తె అయిన రత్నావళిని ఉదయనుడికిచ్చి పెళ్లిచేస్తే వాసవదత్త మనసుకు బాధ కలుగుతుందని భావించి ఆయన ఈ కోరికను తోసిపుచ్చాడు.


కాని కొంతకాలానికి వాసవదత్త లావాణకంలో అగ్నిహోత్రంపాలయి మరణించినట్టు పొక్కిన అసత్య వార్త సింహళానికి చేరింది. వెంటనే సింహళరాజు తన కుమార్తెను ఉదయనుడికిచ్చి పెళ్లి చెయ్యటానికి సుముఖుడై, ఆమెనూ, తన మంత్రి అయిన వసుభూతినీ, యౌగంధరాయణుడి దూతనూ ఒక నౌకలో ఎక్కించి కౌశాంబీ నగరానికి పంపాడు.

నౌక సముద్ర మధ్యంలో ఉండగా పెద్ద తుపాను వచ్చింది. నౌక కాస్తా తునాతునకలైపోయింది. అదృష్టవశాత్తూ రత్నావళికి ఒక కొయ్యపలక చిక్కింది. ఆమె దాని సహాయంతో ప్రాణాలు కాపాడుకున్నది. ఆ స్థితిలో ఉన్న రత్నావళిని సముద్రయానం చేస్తున్న కౌశాంబీ వర్తకుడొకడు చూసి, ఆమెను కాపాడి తనవెంట తెచ్చి యౌగంధరాయణుడికి అప్పగించాడు.

యౌగంధరాయణుడు రత్నావళిని తన రాజుకు భార్యగా మాట్లాడేటప్పుడు

శ్రీ హర్ష నాటక కథ





ముందుగా రాజు అనుమతి పొందలేదు. అందుచేత ఆయన ఇప్పుడు రత్నావళికి సాగరిక అని పేరు పెట్టి, వాసవదత్తకు పరిచారికగా నియమించి కాగలదానికి ఎదురు చూడసాగాడు.

వసంతోత్సవం వచ్చింది. రాణి వాసవదత్తాదేవి మకరందోద్యానంలో రక్తాశోక వృక్షం దగ్గిర తన చెలికత్తెలతోసహా మన్మధ పూజ చేస్తూ ఉన్నది. ఉదయనుడు తన వేడుక చెలికాడైన వసంతకుడితో అక్కడికి బయలుదేరాడు.

సాగరిక మన్మధపూజ చేసేచోట ఉండటం చూసి వాసవదత్త కంగారు పడింది. ఎందుకంటే తన కొత్త చెలికత్తె తన భర్త కళ్ళపడకుండా ఇంతకాలమూ ఆమె జాగ్రత్తపడింది. ఆమె సాగరికతో, "సాగరికా, నువుకూడా ఇక్కడే ఉన్నావా? మిగిలినవాళ్ళంతా ఒళ్ళు తెలియని స్థితిలో ఉన్నారు. నీవు వెళ్ళి గోరువంకను చూసుకో. పూజాద్రవ్యాలు కాంచనమాల పట్టుకుంటుందిలే!" అన్నది.

సాగరికకు ఆశాభంగమయింది. ఈ దేశంలో మన్మధపూజ ఎలా చేస్తారో చూద్దామని ఆమె అనుకున్నది. దేవిగారి ఆజ్ఞ గనక అక్కడినుంచి కదిలింది, కాని చాటున ఉండి పూజకు పూలు కోసుకుని, ఎలాగైనా మన్మధపూజ చూసి మరీ పోదామనుకున్నది.

ఆమె పూలు కోసుకునే సమయంలో ఉదయనుడూ, వసంతకుడూ వచ్చారు. వాసవదత్త మన్మధపూజ పూర్తిచేసి తరవాత భర్తను పూజచేయ నారంభించింది. పూలు కోసుకోవటం పూర్తిచేసి సాగరిక ఒక చెట్టు చాటునుంచి తొంగి చూసేసరికి వాసవదత్త ఉదయనుణ్ణి పూజ చేస్తూవుండటం ఆమె కంటబడింది.

ఉదయనుడి అంద చందాలు చూసి సాగరిక ముగ్ధురాలై తనలో, "ఓహో!

ఈ దేశంలో మన్మధుడే స్వయంగా వచ్చి పూజ చేయించుకుంటాడులాగుందే!" అనుకున్నది. ఎవరైనా వచ్చి తనను చూస్తారని భయపడుతూ కూడా ఆమె అక్కడినుంచి వెళ్ళిపోలేకపోయింది. ఉదయనుణ్ణి ఎంతసేపు చూసినా ఆమెకు తనివి తీరలేదు.

సాగరిక హృదయం ఆ క్షణంనుంచీ ఉదయనుడితో నిండిపోయింది. ఆమె కదళీవనానికి పోయి అక్కడ కూచుని చిత్రఫలకంమీద ఉదయనుడి రూపు చిత్రించసాగింది. అంతలో, గోరువంక గల పంజరాన్ని పట్టుకుని సుసంగత అనే చెలికత్తె అక్కడికి వచ్చింది. సాగరిక తాను రాసిన చిత్తరువును దాచటానికి ప్రయత్నించింది గాని లాభం లేకపోయింది.

సుసంగత ఉదయనుణ్ణి చిత్తరువులో గుర్తించికూడా, "సాగరికా, ఈయన ఎవరు?" అని అడిగింది.

"మన్మధుడు," అని సాగరిక చెప్పింది.

"ఇతని పక్కన రతీదేవిని చిత్రిస్తేగాని ఈ చిత్తరువు పూర్తికాదు. ఆ పని నేను చేస్తాను," అంటూ సుసంగత ఉదయనుడి చిత్రం పక్కనే సాగరిక రూపు చిత్రించింది.

"అదేమిటి నా బొమ్మ వేస్తున్నావు?" అన్నది సాగరిక.



"నీవు ఎలాటి మన్మధుణ్ణి చిత్రించావో నేను అలాటి రతీదేవినే చిత్రించాను. తప్పేం?" అన్నది సుసంగత.

సుసంగత తనకు ఇష్టురాలు, తన రహస్యం కొంతవరకు తెలుసుకోనే తెలుసుకున్నది, అందుచేత సాగరిక ఆమెకు జరిగిన సంగతి యావత్తూ చెప్పేసి తాను రాజును ప్రేమిస్తున్నానన్నది

ఇంతలో కేకలు వినపడ్డాయి. ఏదో కోతి గొలుసు తెంచుకుని అటుగా వస్తున్నట్టు తెలుసుకుని వారిద్దరూ పొదలమాటున దాక్కున్నారు. ఈ గందరగోళంలో గోరువంక పంజరంనుంచి తప్పించుకుని పారి



పోయింది. సుసంగతా, సాగరికా దాన్ని వెతుక్కుంటూ ఎడంగా వెళ్ళారు.

ఆ సమయంలోనే రాజూ, వసంతకుడూ అటుగా వచ్చారు. వారు వచ్చే దారిలో ఒక పొగడచెట్టుపైన చేరిన గోరువంక, తాను అంతకు పూర్వం విన్న స్త్రీల సంభాషణ యావత్తూ పలకసాగింది. ఆ సంభాషణ అంతా విన్న మీదట రాజుకు ఈవిధంగా అర్థమయింది: ఎవరో ఒక సుందరి తాను ప్రేమించినవాణ్ణి చిత్రించి, అతను ఎవరని అడగగా మన్మధుడని తన స్నేహితురాలితో అన్నది. ఆ తరవాత ఆ స్నేహితురాలు మొదటి సుందరి రూపును కూడా చిత్రించి రతీదేవి అన్నది! ఈ కథ విని వసంతకుడు సంతోషంతో చప్పట్లు చరిచేసరికి గోరువంక పొగడచెట్టుమీది నుంచి ఎగిరిపోయింది.

వసంతకుడు మూర్ఖుడై పారదోలకపోయినట్టయితే గోరువంక ఇంకా ఏమి చెప్పేదో గదా అనుకుంటూ రాజు కదళీగృహం ప్రవేశించి చిత్రఫలకాన్ని చూశాడు. అందులో తన రూపంతోబాటు ఎన్నడూ చూడని ఒక సుందరి రూపు ఉండటం చూసి రాజు ఆమెను గొప్పగా వర్ణించసాగాడు. ఈలోపుగా కదళీవనానికి తిరిగి వస్తున్న సుసంగతా, సాగరికా ఆగి రాజు మాటలు విని లోపల ఎంతో ఆనందం పొందారు

"చిత్రఫలకం వాళ్ళవద్ద ఉన్నది వెళ్ళి తెచ్చుకో! దానికోసమేగదా మళ్ళీ వచ్చాము," అన్నది సుసంగత. కాని సాగరిక రాజు ఎదటికి వెళ్ళటానికి బిడియపడింది.

చేసేది లేక సుసంగత రాజు ఎదటికి వెళ్ళి చిత్రఫలకం ఇవ్వమన్నది. రాజు మాట మార్చబోయాడు. "మీ మాటలన్నీ విన్నాను. చిత్రఫలకం ఇవ్వకపోతే దేవిగారితో అంతా చెప్పేస్తాను," అన్నది సుసంగత.

"కోప్పడకు, నేను వేళాకోళానికే మాట్లాడాను. ఇంద, ఈ ఆభరణం తీసుకో!" అన్నాడు రాజు.


"నేనూ నవ్వులకే బెదిరించాను. నాకు ఏ ఆభరణమూ అక్కర్లేదు. నిజంగా కోపం వచ్చిన సాగరిక చాటున ఉన్నది. వెళ్ళి మంచి చేసుకోండి!" అన్నది సుసంగత.

"ఏదీ? ఎక్కడ?" అంటూ రాజు సాగరికను సమీపించి, ఆమె చెయ్యి పట్టుకుని తన ప్రేమను చెప్పుకున్నాడు. ఇంతలో వాసవదత్త తన చెలికత్తె అయిన కాంచనమాలతో సహా అటుగా వచ్చింది. సాగరికా, సుసంగతా ఎటో వెళ్ళిపోయారు.

దురదృష్టవశాత్తూ చిత్రఫలకం వాసవదత్త కంటపడ్డది. దానిపై తన భర్త రూపూ, సాగరిక రూపూ ఉండటం చూసి వాసవదత్తకు అనుమానమూ, అసూయా కలిగాయి. "మీ పక్కన ఉన్న స్త్రీని ఎవరు చిత్రించారు?" అని ఆమె అడిగితే రాజు, "నేనే ఊహించి చిత్రించాను," అన్నాడు.

కాని వాసవదత్త ఆ మాట నమ్మలేదు. అయినా ఆమె భర్తను ఏమీ అనకుండా అక్కడినుంచి వెళ్ళిపోయింది. ఆ తరవాత వాసవదత్త సాగరికను గురించి కట్టుదిట్టాలు చేసింది. రాజు సాగరికపైన గల ప్రేమచేత మనోవ్యాధిలో పడ్డాడు. అందుకని వసంతకుడు రాజునూ సాగరికనూ ఒకచోట చేర్చటానికి ఒక ఎత్తు వేశాడు: సాగరికకు వాసవదత్త దుస్తులు ధరింపజేసి ఒకనాటి





సాయంకాలంవేళ మాధవీలతా మంటపానికి తీసుకురమ్మని సుసంగతతో చెప్పాడు.

ఈ సంగతి ఒక చెలికత్తెద్వారా వాసవదత్తకు తెలిసింది. ఇది నిజమో కాదో తెలుసుకుందామనే ఉద్దేశంతో సాయంకాలంవేళ ఆమె మాధవీలతామంటపం వద్దకు వచ్చింది. రాజు మసకచీకటిలో ఆమెను చూసి, వాసవదత్త దుస్తులు ధరించిన సాగరికే అనుకుని, తనకు సాగరికపైన గల మోహమంతా వాసవదత్తకు విన్నవించుకున్నాడు. ఆ మాటలు విని మండిపోయి ముఖంమీది మేలిముసుగు తీసివేసి, "నేను సాగరికలాగా కనిపిస్తున్నానా?" అన్నదామె.

రాజు బిత్తరపోయాడు, వాసవదత్తను ఎన్నోవిధాల క్షమాపణ వేడుకున్నాడు. ఆమె మనసు మెత్తబడలేదు. భర్తను క్షమించకుండానే ఆమె అక్కడినుంచి బయలుదేరింది. ఇంతలో నిజంగా సాగరికే వాసవదత్త వేషంతో అక్కడికి వచ్చింది.

సాగరికను చూసి రాజు పొందిన ఆనందానికి మేరలేదు.

ఇంతలో వాసవదత్తకు తన భర్తమీద జాలి కలిగి అతనితో రాజీ పడటానికి తిరిగి వచ్చి, రాజు సాగరికతో ప్రేమాలాపాలు ఆడుతూ ఉండటం ప్రత్యక్షంగా చూసింది.

ఇక ఉపేక్షించి లాభంలేదనుకుని వాసవదత్త సాగరికను అంతఃపురంలో ఎవరికీ తెలియకుండా నిర్బంధంలో పెట్టేసింది. తనకు ఏదో కీడు రానున్నదని శంకించి సాగరిక తన రత్నహారాన్ని తన సఖి అయిన సుసంగత కిచ్చి, ఎవరైనా బ్రాహ్మణుడికి దానమివ్వమని చెప్పింది. సుసంగత ఆ రత్నహారాన్ని వసంతకుడి కిచ్చింది.

సాగరిక ఏమయిందో, బతికిఉన్నదో లేదోకూడా తెలియక అలమటించే రాజుకు తన వయస్యుడి మెడలో రత్నహారం చూసేసరికి ఆనందమూ, దుఃఖమూ కూడా రెట్టింపు అయాయి.



ఇంతలో వాసవదత్త స్వదేశమైన ఉజ్జయినినుంచి సంవరణసిద్ధి అనే ఐంద్రజాలికుడు వచ్చినట్టు తెలిసింది. సాగరిక మాయమైనప్పటినుంచీ విచారంలో మునిగిఉన్న తన భర్త మనసు రంజింపజెయ్యటానికిగాను వాసవదత్త ఇంద్రజాల ప్రదర్శనం ఏర్పాటుచేసింది. ఐంద్రజాలికుడు చాలా గట్టివాడు. అతను రాజుకూ, వాసవదత్తకూ, మిగిలినవాళ్ళకూ ఆకాశంలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులనూ, దేవతలనూ, నృత్యంచేసే అప్సరసలనూ చూపి, చూచేవారికి అనందాశ్చర్యాలు కలిగించాడు.

అయితే ఈ ఇంద్రజాల ప్రదర్శనం పూర్తి కాకమునుపే యౌగంధరాయణుడు రాజుగారిని చూడటానికి ఎవరినో పంపాడు. ఈ వచ్చిన వాళ్లు మరెవరో కాదు, సింహళ మంత్రి వసుభూతీ, యౌగంధరాయణుడు సింహళానికి పంపిన దూతా.

ఓడ పగిలినప్పుడు వీరుకూడా ప్రాణాలు దక్కించుకుని కొంచెం అలస్యంగా కౌశాంబీ నగరం చేరుకున్నారు.

రాజుగారు ఐంద్రజాలికుడితో, "నీ ప్రదర్శనం కొంచెంసేపు ఆపవోయ్!" అన్నాడు.

"తమ చిత్తం, నేను తమకు చూపవలసిన వేడుక ఇంక ఒకటే ఉన్నది. తరువాత



చూపుతాను," అని ఐంద్రజాలికుడు అవతలికి వెళ్ళాడు.

వసుభూతి అక్కడికి వస్తూనే వసంతకుడి మెడలో ఉన్న రత్నహారం చూసి, "ఇది మా రాజకుమార్తె హారంలాగే ఉన్నదే!" అనుకున్నాడు. ఆయన రాజుతో జరిగిన సంగతులన్నీ చెప్పి, రత్నావళి రాజును వివాహమాడే ఉద్దేశముతో ఓడ యెక్కి వస్తూ, సముద్రమధ్యంలో ఓడ పగిలి ఆమె చనిపోయిన సంగతి చెప్పాడు.

రత్నావళిని తనకు పెళ్లి చెయ్యాలని యౌగంధరాయణుడు ప్రయత్నాలు చేశాడని తెలిసి రాజు ఆశ్చర్యపడ్డాడు. ఎందు

కంటే రాజుకు ఆ గొడవ ఏమీ తెలియదు. వాసవదత్త మాత్రం తన చెల్లెలు సముద్రంలో మునిగిపోయిందని విని కంట తడిపెట్టింది.

సరిగా ఇదే సమయంలో అంతఃపురంలో మంటలు లేచాయి. హాహాకారాలు వినవచ్చాయి. వాసవదత్త కంగారుగా, "కాపాడండి! కాపాడండి!" అని అరిచింది. రాజు ఆమెతో, "భయపడకు!" అన్నాడు.

"అది కాదు. సాగరికను అంతఃపురంలో గొలుసులతో బంధించి ఉంచాను. ఆమెను రక్షించండి!" అన్నది వాసవదత్త.

రాజు సాహసించి మంటలలో జొరబడ్డాడు. రాజువెంట మిగిలినవారు కూడా వెళ్లారు. రాజు ఆ భీభత్సంలో సాగరిక ఉన్నచోటు తెలుసుకుని ఆమెను బంధవిముక్తురాలిని చేసి ఇవతలికి తెచ్చాడు. కాని తీరా చూస్తే ఎక్కడా మంటలుగాని, మంటల జాడలుగాని లేవు. అంతా ఇంద్రజాలం! వెళ్లిపోయేటప్పుడు ఇంద్రజాలికుడు ఇంకొక్క వినోదం చూపించాలని అన్నాడే —అదే ఇది.

ఈ ఇంద్రజాలంతోనే అన్ని చిక్కులూ గట్టెక్కాయి. వసుభూతి సాగరికను చూడగానే ఆమె తమ రాజకుమార్తె అయిన రత్నావళి అని పోల్చుకున్నాడు. రత్నావళి తన భర్తను పెళ్ళాడటానికి వాసవదత్త సంతోషంతో ఒప్పుకున్నది.

యౌగంధరాయణుడికి సాగరిక రత్నావళి అని తెలిసికూడా బయటపెట్టలేదు. రాజుగారు ఆమెను పెళ్ళాడటానికి ఒప్పుతాడో ఒప్పడోనన్న శంకే దానికి కారణం. చివరకు ఇంద్రజాలికుణ్ణి పంపకం చేసినవాడు కూడా యౌగంధరాయణుడే! ఇన్ని చేసినప్పటికీ యౌగంధరాయణుడి ఉద్దేశం తమ రాజు రత్నావళిని పెళ్ళాడి సార్వభౌముడు కావాలనే! అందుచేత రాజూ వాసవదత్తా ఆయనను క్షమించారు.



కాళికాదేవి వరం



పూర్వం తెనాలిలో రామకృష్ణుడని ఒక అబ్బాయి వుండేవాడు. బడి మానేసి ఎప్పుడూ ఆట లాడుతూ పూరంతా తిరిగేవాడు.



ఓరోజు వాళ్ళ నాన్నగారి స్నేహితుడు చూసి "రామకృష్ణా, నీకు సిగ్గులేదూ? చిన్నపిల్లలతో ఆడుతున్నావా!" అని కోప్పడ్డాడు.



"నీలాటి పెద్దపిల్లలు ఆడుకోడానికి రారుకదా," అన్నాడు రామకృష్ణుడు. "నీకోసం మీ నాన్న వెతుకుతున్నాడు," అన్నాడు ఆయన.



"ఎందుకూ? చద్ది అన్నం తినేసి వచ్చానుగా," అన్నాడు రామకృష్ణుడు. "అన్నం పెట్టడానిక్కాదు. బళ్ళోకి వెళ్లావేలేదో అని," అన్నాడాయన



శాస్త్రులవారెంత చెప్పినా రామకృష్ణుడు వినలేదు. "ఒక ఘడియ కూడా ఆడుకోనివు," అంటూ అక్కడినించి బయలుదేరాడు.



ఆ అల్లరి పిల్లాడి చురుకుదనం చూస్తూన్న ఒక సిద్ధుడు "వత్సా! ఇటు రా," అని పిలిచాడు. "ఒక్కమారు ఆట కట్టి ఇటురా," అన్నాడు.

"నువ్వు మాట కట్టి జపం చేసుకోరాదూ," అన్నాడు రామకృష్ణుడు. "అలాగే నాయనా. కాళీ





గుడికి రా నాతో," అన్నాడు సిద్ధుడు. "నీ పేరేమిటి నాయనా?" "నా పేరు రామకృష్ణుడు. మా నాన్న రామయ్యగారు. మాది కౌండిన్యస గోత్రం." "నీకు మంత్రం ఉపదేశిస్తాను. ఇది జపిస్తే కాళి ప్రత్యక్షమై నీకు కావలసిన వరం...." "నాకు కావలిసిన దిస్తుందా? నేనడిగినదిస్తుందా?"





"అసాధ్యుడివి. భయంలేదు. నీకు కావలసిందే నువ్వు అడుగుతావులే," అన్నాడు సిద్ధుడు. "ఆవిడ ఇస్తేగిస్తే విద్యలే ఇమ్మంటానులే." సిద్ధుడు రామకృష్ణుడికి మంత్రం ఉపదేశించాడు. "భక్తి శ్రద్ధలతో జపంచెయ్యి, నాయనా," అని చెప్పాడు. "విద్యను, ఇంకొకళ్ళకి ఇవ్వాలి. నువ్వు





తగినవాడివని నాకు తోచింది. విద్యాశాలివై వర్ధిల్లు నాయనా," అని దీవించి సిద్ధుడు వెళ్ళిపోయాడు.



తరవాత రామకృష్ణుడు భక్తితో మంత్రం జపించాడు. కాళికాదేవి వెయ్యి తలలతో ఎనిమిది చేతులతో ప్రత్యక్షమైంది.



దేవిని చూడగానే రామకృష్ణుడు దణ్ణం పెట్టే బదులు పకాలున నవ్వాడు. దేవికి కోపం వచ్చింది. వెంటనే అతను చెంపలేసుకుని....



"అపరాధం తల్లీ—మన్నించు. మా అందరికీ ఒకటే తలవుంది. అయినా జలుబు చేస్తే సంభాళించుకుందుకు రెండు చేతులు చాలవు.



మరి నీకు వెయ్యి తలలు ఎనిమిదే చేతులు వున్నాయికదా, జలుబు చేస్తే ఎలాగా అని."
దేవికి కోపం పోయింది. ఆమె నవ్వింది.



"ఈ పాత్రలో వున్న పాలు తాగితే సర్వ విద్యలూ, ఇందులో వున్న పెరుగు తాగితే సకల సంపదలూ లభిస్తాయి. నీకేది కావాలో కోరుకో."



"అమ్మా నేను మానవుడిని. విద్యలేదు. ఏది కావాలో ఎంచుకోవడానికి ముందు ఆ రెండు పాత్రలూ ఒక్కమారు నా చేతికిస్తే—"



అంటూ దేవి చేతుల్లోంచి ఆ రెండూ అందుకుని రెండూ ఒక్కమారే తాగేశాడు. దేవి ఆగ్రహించి "నువ్వు వికటకవి అవుతావు," అని శపించింది.




రామకృష్ణుడు ప్రార్థించాడు. "నువ్వు అమ్మవి. నేను నీ బిడ్డని. కాబట్టి నేను తప్పు చేయాలి, నువ్వు క్షమించాలి."

దేవి శాంతించింది. "నువ్వు వికటకవి అయినా రాజగౌరవం పొంది కీర్తీ, ధనం కూడా ఆర్జిస్తావు. వెళ్ళు, వర్ధిల్లు!" అని దీవించింది.


బంగారు మామిడి పళ్లు



తెనాలి రామకృష్ణుడు పారుగూరు వెళ్లి అప్పుడే వచ్చాడు. దారిలో—"ఏమిటి విశేషం! బండ రాములవారు అమరం పని పట్టించారే."



రాముడికి కోపం వచ్చింది. "పెద్ద, మీరొక్కరే పండితులు అనుకుంతునారా? నేనూ బంది తున్నే. సమస్తం ఇపుడే చదివేశ్తాను."



"ఒద్దురా నాయనా. ఆ తాటాకు కట్టలు మోసి అలా అరిస్తే, ఇందాక తిన్న బూరెలూ గారెలూ అరిగిపోతాయి. మళ్లీ ఆకలేస్తుంది."



"రేపు రాయలువారు నాకు బంగారపు మావిడి పండిత్తారుగా, నేనే కొనుక్కుంటా." "ఎందు కిస్తారూ?" "నే చెప్పను ఫో."



రాచవీధిలో శంభుశాస్త్రుల్లు కనిపించి, "కవి గారూ, బొజ్జ పెరిగే ఉపాయం చెబుదురూ." "బొజ్జ పెరిగితే పిల్లనిచ్చి పెళ్లిచెయ్యరుసుమా."



"రేపు రాయలవారు బ్రాహ్మణులందరికీ బంగారపు మావిడిపళ్లు దానమిస్తున్నారు. వేషం కుదరకపోతే బాగుండదు."



అల్లసాని పెద్దనగారింటికి వెళ్ళగానే రామకృష్ణుడు ఈ సంగతి అడిగాడు. "అవును రామకృష్ణా, రేపు ఆయన తల్లి నాగాంబ పుణ్యతిథి. ఆమెకు మామిడిపండ్లు ఇష్టమట, అందుకని బ్రాహ్మణులందరికీ బంగారపు మామిడిపండ్లు ఇస్తున్నారు," అన్నారు పెద్దనగారు.




ఆవేళకి అక్కడే ఉన్న రాజగురువు తాతాచార్యులవారు, "ఇది ఆపడానికి నువ్వే ఏదైనా ఉపాయం చెయ్యాలి రామకృష్ణా," అన్నారు.





ఆ మర్నాడు కోటగుమ్మం దగ్గర కోలాహలంగా ఉంది. తెనాలి రామకృష్ణుడు బంగారు పళ్లు కావలసిన వాళ్ళంతా ముందు తనదగ్గిర వాతలు పెట్టించుకోవాలన్నాడు. ఎన్ని చురకలు అయితే అన్ని పళ్ళు ఇస్తారని ఆశపెట్టాడు. అందరూ శక్తికొద్దీ వాతలు వేయించుకుంటున్నారు.



రాజుగారి భవనంలో బ్రాహ్మణులంతా వరుసగా వచ్చి సువర్ణఫలాలు తీసుకొని కృష్ణదేవరాయలను దీవించి వెళ్తున్నారు. ఐండరాముడు పండు తీసుకొని వెళ్ళక, "నాకు మూడు పళ్లు ఇవ్వాలంది. మూడు వాతలున్నాయిగా," అన్నాడు.





రాయలవారికి చాలా ఆగ్రహం కలిగింది. "రామకృష్ణ కవిగారిని తక్షణమే సభామందిరానికి తీసుకురా!" అని భటునికి ఆజ్ఞ ఇచ్చారు.



రాయలవారు "ఏమిటిది? వాతలేమిటి? ఎవరు పెట్టారు!" అన్నారు. అక్కడున్నవారు, "తెనాలి రామకృష్ణ కవి," అని అరిచారు.


శ్రీమన్మహారాజ, రాజపరమేశ్వర బిరుదాంకితుడు అయిన కృష్ణదేవరాయలను "విజయోస్తూ" అని దీవిస్తూ రామకృష్ణుడు వచ్చాడు




"బ్రాహ్మణులకు వాతలు ఎందుకు పెడుతున్నారు?" అని రాయలవారు, రామకృష్ణుణ్ణి కోపంగా ప్రశ్నించారు.



ఈ ప్రశ్నకు రామకృష్ణుడు ఏమాత్రం భయపడక, "మహాప్రభూ! మా తల్లిగారు వాత రోగంతో చనిపోయారు—



—నేడే ఆవిడ ఆబ్దికం. అందువల్ల ఆమె ఆత్మ శాంతి కోసం బ్రాహ్మణులకు దక్షిణగా వాతలు పెడుతున్నాను," అన్నాడు రామకృష్ణుడు.



డబ్బును ఇలా దండుగ చేయడం తగదని చెప్పడానికే రామకృష్ణుడు ఇంత పని చేశాడు. రాజుగారు మెచ్చుకున్నారు.



"సోమరి నాగు"


పూర్వం గజదొంగలుగా ప్రసిద్ధికెక్కిన వారిలో చాలామంది ప్రజాకంటకులు కారు. వాళ్లు సామాన్య ప్రజలకు ఒకొక్కప్పుడు తోడ్పడేవారుకూడా. దొంగతనాలు చెయ్యటం లోనూ, పట్టుపడకుండా తప్పించుకోవటం లోనూ వారికి గల నేర్పును ఆబాలగోపాలం ఎంతో గొప్పగా చెప్పుకునేవారు. అలాటి దొంగ రెండువందల ఏళ్లక్రితం చీనాదేశం లోని సూచోవ్ నగరంలో ఉండేవాడు. వాడి అసలు పేరేమిటో ఎవరికీ తెలియదు. అందరూ వాణ్ణి "సోమరి నాగు" అని పిలిచే వాళ్లు. వాడు ఒకొక్కప్పుడు రోజుల తరబడి నిద్రపోయేవాడట. ఈ పేరును ఆ దొంగ స్వయంగా పెట్టుకున్నాడంటారు.

"సోమరి నాగు" గురించి అనేక కథ లున్నాయి. వాడు ఎన్నడూ పేదలను దోచ లేదు, అక్రమంగా ధనం సంపాదించి కూడబెట్టిన వారినీ, దుర్మార్గులనూ మాత్రమే దోచి, తాను సంపాదించినది ఎప్పటికప్పుడు పేదలకు పంచాడు. అందుచేత, ఎన్ని దొంగతనాలు చేసినా వాడికి సొంత ఆస్తి అంటూ చిల్లిగవ్వకూడా ఏనాడూ లేదు. ఒక్కసారి కూడా వాణ్ణి అధికారులు పట్టుకోలేదు. అయితే వాడు గజదొంగ అని అందరికీ తెలుసు. ఒకొక్కసారి అధికారులు సయితం వాడి సహాయం పొందారు.

ఈ విచిత్రమైన దొంగను గురించిన కొన్ని కథలు చెప్పుకుందాం:

ఒకసారి ఒక ధనికుడు ఒక సాలెవాడి వద్ద వెయ్యి పలాల వెండి దాచబెట్టినట్టు సోమరి నాగుకు తెలియవచ్చింది. వాడు దాన్ని ఎలాగైనా కాజెయ్యాలనుకుని ఆ రాత్రి దొంగతనానికి వచ్చాడు. అయితే వాడు చీకటిలో పొరపాటుపడి ఒక పేదవాడి ఇంట్లో ప్రవేశించాడు. ఆ ఇంట దాక్కోవటానికి కూడా ఒక బల్ల తప్ప

చీనా జానపద కథ



ఇంకేమీ లేదు. సోమరి నాగు ఆ బల్లకింద ముడుచుకు కూచున్నాడు.

కొద్దిసేపటికి ఇల్లుగలవాడూ, అతడి భార్యా భోజనానికి కూచున్నారు. భర్త దిగులుగా భార్యతో, "బాకీ తీర్చే గడువు ముగిసింది. దగ్గిర చిల్లి గవ్వ లేదు. ఆత్మహత్య తప్ప మరొక మార్గం కనబడదు," అన్నాడు.

"ఆత్మహత్య చేసుకోవద్దు. నన్ను అమ్మేస్తే వచ్చే డబ్బుతో చిన్న వ్యాపారం చేసుకోవచ్చు," అన్నది భార్య. ఇద్దరూ కన్నీరు కార్చసాగారు.

అంతలో సోమరి నాగు బల్ల కిందినుంచి ఇవతలికి దూకి, "భయపడకండి. నేను పొరపాటున మీ ఇంట ప్రవేశించాను. మీరు చూడగా ఇక్కట్టులో ఉన్నట్టున్నారు. మీకు రెండువందల పలాల వెండి ఇస్తాను. ఏదైనా వ్యాపారం చేసుకోండి. అంతేగాని అఘాయిత్యానికి దిగవద్దు," అని చెప్పి బయటికి వెళ్ళిపోయాడు.

మరి కాస్సేపటికి వారి గుమ్మం వెలపల దభేలుమని చప్పుడయింది. తలుపు తెరిచి చూస్తే ఒక మూటా, అందులో రెండు వందల పలాల వెండీ ఉన్నాయి. దానితో ఆ దంపతులు ఒడ్డెక్కటమే గాక సోమరి నాగు పేరు ఒక పలకపైన రాసి బతికినన్నాళ్లూ దానిని పూజించారు.

సోమరి నాగు బాల్యస్నేహితుడొకడు పెద్దవాడై ఉన్నదంతా పోగొట్టుకుని పూర్తిగా పకీరు అయిపోయాడు.

ఒకనాడు వాడు వీధిలో ఎదురయేసరికి సోమరి నాగు తన కళ్ళను తానే నమ్మలేకపోయి, "ఏమిటి ఇలా మారిపోయావు?" అని అడిగాడు. వాడు తన కష్టాల సంగతి చెప్పుకున్నాడు.


"ఎవరితోనూ అనకు. నేను రేపు ఒక ధనికుడి ఇంట దొంగతనం చెయ్యబోతున్నాను. నా వెంట వచ్చావంటే నీకు కొంత డబ్బు ఇస్తాను!" అన్నాడు సోమరి నాగు.

స్నేహితుడికి ప్రాణం లేచివచ్చింది. ఎందుకంటే నాగు గజదొంగ అనీ, అడి తప్పడనీ వాడికి తెలుసు. మర్నాడు వాడు సోమరి నాగు వెంట ఒక అధికారి ఇంటికి వెళ్ళాడు. తన మిత్రుణ్ణి ప్రహరీగోడ వెలపల ఉండమని సోమరి నాగు ఒక చెట్టు ఎక్కి ఇంటి ఆవరణలోకి దూకాడు.

చాలాసేపు గడిచిందిగాని సోమరి నాగు తిరిగి రాలేదు. ఇంతలో, ప్రహరీగోడకింద నక్కి కూచున్న స్నేహితుడిపైకి కుక్కలు మొరుగుతూ వచ్చి పడ్డాయి. వాడు గోడ వెంబడే పరిగెత్తసాగాడు. కాస్సేపటికి తడిసి ముద్ద అయిన సోమరి నాగు వచ్చి వాణ్ణి కలుసుకుని దీనంగా, "నీకోసం ఇవాళ నేను చచ్చినంత పని అయింది. ఆ ఇంట బంగారం కుప్పలు తెప్పలుగా ఉంది. నేను కొంత తీసుకుని వస్తుండగా కుక్కలు మొరిగాయి. జనం లేచి నా వెంటపడ్డారు. బంగారం అవతల పారేసి ప్రాణాలతో బయటపడ్డాను," అన్నాడు.

"నీవంటి గజదొంగే ఇంత ఇరుకున పడ్డాడంటే నా గీత సరిగా లేదన్నమాట!" అంటూ మిత్రుడు నిట్టూర్చాడు.

"విచారించకు. త్వరలోనే నీకు సహాయం చేస్తాను," అన్నాడు సోమరి నాగు.



తరవాత ఒకనాడు సోమరి నాగుతో మిత్రుడు, "దినం గడవక నానా అగచాట్లూ పడిపోతున్నాను," అన్నాడు.

"నేను అనాడే ఒక పెట్టె తస్కరించాను. దాన్ని అప్పుడే నీకిస్తే ఆ అధికారి మనుషులు నిన్ను పట్టుకుంటారేమోనని ఆ పెట్టెను ఆ ఆవరణలోనే ఉన్న నీళ్ళ గుంటలో పడేశాను. అధికారి ఏ కారణం చేతనో కిక్కురుమనకుండా ఊరుకున్నాడు. అందుచేత ఈ రాత్రి మనం వెళ్ళి తెచ్చుకుందాం," అన్నాడు సోమరి నాగు.

ఆ ప్రకారమే నాగు ఆ రాత్రి ఆ పెట్టెను పట్టుకొచ్చాడు. దానినిండా బంగారమూ,

వెండీ ఉన్నాయి. అందులో ఒక్క పలుకు కూడా సోమరి నాగు ఉంచుకోక, అంతా తన మిత్రుడి కిచ్చేస్తూ, "దీనితో మంచి ఆస్తి సంపాదించుకుని బతికి ఉన్నన్నాళ్ళూ సుఖపడు. నాలాగా బైరాగివి మాత్రం కాకు," అన్నాడు.

అతని స్నేహితుడు ఆ డబ్బుతో వ్యాపారం చేసుకుని కొన్నాళ్ళకు గొప్ప ధనవంతుడయాడు.

సోమరి నాగు ఎన్నో యుక్తులూ, విద్యలూ నేర్చినవాడు. వాడు రకరకాల చప్పుళ్లు అనుకరించేవాడు. అనేక యాసలతో మాట్లాడేవాడు, ఎవరిని పడితే వారిని అనుకరించేవాడు. ఇటువంటి విద్యలు వాడికి అవసరానికి ఉపయోగపడేవి.

ఒకనాడు వాడు ఒక ఇంట జొరబడి దుస్తులుంచే గది తలుపు తెరిచిఉండటం చూశాడు. వాడికా దుస్తులు కాజెయ్యాలని బుద్ధిపుట్టింది. కాని వాడా గదిలో ప్రవేశించాడో లేదో ఇంటివారు పడుకోబోతూ దాసీదాన్ని పంపి ఆ గది తలుపుకు తాళం వేయించారు. సోమరి నాగు ఆ దుస్తుల గదిలో చిక్కుకుపోయాడు.

తలుపు తాళం తెరిస్తేగాని తాను బయట పడే దారి లేదని తెలియగానే వాడొక ఉపాయం పన్నాడు. తన వంటినిండా



వీలయినన్ని బట్టలు చుట్టుకుని, మరికొన్ని బట్టలు మూట కట్టి తలుపుకు అడ్డంగా పెట్టి, ఎలుక బట్టలు కొరుకుతున్న చప్పుడు చేశాడు. ఇంటి యజమాని ఆ చప్పుడు విని, "బట్టల కొట్టులో ఎలుక చేరినట్టుంది. తాళం తీసి దాన్ని బయటికి తరిమి మళ్ళీ తాళం వెయ్యి," అని దాసీని ఆజ్ఞాపించాడు.

దాసీది దీపంతో వచ్చి తలుపు తాళం తీసింది. అది తలుపులు బయటికి లాగ గానే బట్టల మూట బయటికి దొర్లింది. దానితోబాటు సోమరి నాగు కూడా బయటికి దొర్లుతూ, దాసీ చేతిలో ఉన్న దీపాన్ని కింద పడగొట్టాడు.

దాసీది కెవ్వున అరిచింది. ఆలస్యం చేస్తే మనుషులు వచ్చి పడతారని, సోమరి నాగు దాసీదాన్ని పడదోసి, మూట పట్టుకుని బయటికి పరిగెత్తాడు. యజమాని పరిగెత్తుకుంటూ వచ్చి చీకట్లో దాసీదాన్ని చూసి దొంగ అనుకుని చావగొట్టాడు. దాని పాలి కేకలకు ఇంటిల్లిపాతీ వచ్చారు. దీపం వెలిగించి తెచ్చినాకగాని నిజం తెలియలేదు. ఇంటి యజమానికి దొరికినది దాసీదేగాని దొంగ కాదని బయటపడేసరికి దొంగ తప్పించుకు పోనేపోయాడు.

మరొకసారి ఒక ధనికుడు ఒక సిల్కు వర్తకుడికి పెద్ద మొత్తం బయానాగా



ఇచ్చాడు. ఆ డబ్బు కాజెయ్యాలని సోమరి నాగుకు పుట్టింది. వర్తకుడు ఆ సొమ్మును తానూ భార్యా పడుకునే మంచం లోపలి తట్టున దాచి ఉంచి రాత్రిళ్ళు కాపాడు కుంటూ వస్తున్నాడు.

సోమరి నాగు ఒక రాత్రి ఆ వర్తకుడి పడక గది ప్రవేశించి మంచంమీద కాలు పెట్టి ఎక్కి డబ్బుపెట్టెను అందుకున్నాడు.

ఇంతలో వర్తకుడి భార్య మేలుకుని మంచంపైన ఏదో ఉన్నట్టు అనుమానించి చీకట్లో తడివి, దొంగ కాలు దొరికేసరికి గట్టిగా పట్టుకున్నది. వెంటనే ఆమె భర్తను లేపి, "ఇడుగో దొంగ! కాలు పట్టు కున్నాను!" అని చెప్పింది.

అదే సమయంలో సోమరి నాగు వర్త కుడి కాలు పట్టుకుని గట్టిగా గిల్లాడు. వర్త కుడు బాధతో, "అయ్యయ్యో! అది నా కాలు!" అని కేకపెట్టాడు. భార్య కంగారు పడి తాను పట్టుకున్న కాలుకాస్తా వదిలి పెట్టింది. మరుక్షణమే సోమరి నాగు పెట్టెతో సహా బయటికి వెళ్ళిపోయాడు.

తరవాత భార్యాభర్తలు తర్జనభర్జన చేసు కున్నారు. "నేను పట్టుకున్నది దొంగాడికాలే! అకారణంగా నాచేత వదిలింపించావు!" అన్నది భార్య.

"ఇంకా నయం! నా కాలు ఇంకా సలుపుతూనే ఉంది!" అన్నాడు భర్త.

"నీ కాలు లోపలివేపు ఉంది. నేను పట్టుకున్న కాలు బయటివేపు ఉంది. పైన నేను కాలు గిల్లలేదు!" అన్నది భార్య.

"అలా అయితే దొంగాడే ఒకవేళ నా కాలు గిల్లాడేమో! నువు వాడి కాలు విడవ కుండా ఉండవలిసింది," అన్నాడు భర్త.

"అమ్మయ్యో అని గావుకేక పెట్టేసరికి హడలిపోయాను," అన్నది భార్య. వాళ్ళు ఈ వితర్కం మానేసి డబ్బుపెట్టెకోసం చూసుకుంటే అది అప్పుడే పోయింది.

—(ఇంకా వుంది)





మరొక పౌర్ణమి వచ్చింది. తాతయ్య పిండార బోసినట్టున్న వెన్నెలలో పడక కుర్చీలో కూచుని, నస్యం పెద్దపట్టు పట్టి పీల్చి, ఒక శ్లోకం చదివాడు:

"వస్తుషు బ్రహ్మసృష్టేషు
స్థావరేషు చరేషుచ
సఫలం దృశ్యతే సర్వం
విఫలం నైవ దృశ్యతే."

చుట్టూ కూచున్న పిల్లలు, "ఆ శ్లోకానికి అర్థమేమిటి, తాతయ్యా?" అని ఏక కంఠంగా అడిగారు.

"ఆ శ్లోకానికి అర్థం చెప్పమంటున్నారా? వినండి. బ్రహ్మదేవుడు సృష్టిచేసిన వస్తువులలో కదిలేవీ, కదలనివీ ఎన్నో ఉన్నాయి గదా, వీటిల్లో వృథా అయినది ఒక్కటిన్నీ లేదు; ఏదో ఒకవిధంగా అన్నీ ఉపయోగం గలవేనూ అని ఆ శ్లోకానికి అర్థం," అన్నాడు తాతయ్య.

"ఈ సంగతి ఎవరు చెప్పారు, తాతయ్యా?.... ఏదన్నా కథ చెప్పు, తాతయ్యా?" అన్నారు పిల్లలు.

"ఇంకో కథ దేనికి? ఈ విషయం గురించే కథ చెబుతాను వినండి," అంటూ తాతయ్య ఇలా చెప్పాడు:

వెనకటికి అంగపాలుడనే రాజు అంగ దేశాన్ని పాలిస్తూ ఉండేవాడు ఆయన ఏంచేశాడో తెలుసా? సృష్టిలో ఉపయోగకరమైనవేవి, పనికిమాలినవి ఏవి అని చాలా కాలం దీర్ఘంగా పరిశోధనలు చేశాడు. చివరకు ఏంతేల్చుకున్నాడంటే, సృష్టిలో దోమలూ, సాలీళ్ళూ తప్ప మిగిలినవన్నీ ఏదో ఒక విధంగా ఉపయోగపడేవేనూ అని నిశ్చయించుకున్నాడు.

ఇంకేముందీ? అది మొదలు ఆయన తన రాజ్యంలో ఎక్కడ దోమలున్నా, ఎక్కడ సాలీళ్ళున్నా చంపెయ్యవలిసిందని,

తాతయ్య కథలు:—4

రచన: సి. శేషాద్రి

తన సైనికులకూ ఉద్యోగస్థులకూ ఉత్తరువు లిచ్చాడు.

ఇది రాజ్యంలోని ప్రజలకు కూడా బాగానే వున్నట్టు తోచింది.

అందుచేత వారు రాజుగారి చర్య చూసి చాలా సంతోషించారు.

ఇంతలో ఏమయిందనుకున్నారు? హఠాత్తుగా అంగదేశంపైకి శత్రువులు వచ్చి పడ్డారు. అంగపాలుడు యుద్ధానికి సిద్ధంగా లేనందువల్ల అతడు కొద్దిమంది నమ్మకస్తులైన సేవకులను వెంటబెట్టుకుని అడవుల్లోకి పారిపోయాడు.

ఆ రాత్రి రాజూ, సేవకులూ అడవిలోనే పడుకుని నిద్రపోయారు.

కాని ఒకరాత్రివేళ దోమలు వారిని కుట్టి నిద్ర లేపాయి.

ఇదీ ఒకందుకు మేలే అయింది. ఏమంటే, రాజును వెతుకుతూ శత్రువులు అడవి అంతా ఘాలిస్తున్నారు.

ఆ అలికిడి విని రాజు, అక్కడ ఉండటం ప్రమాదమని గ్రహించి అప్పటికప్పుడే తన సేవకులతో సహా బయలుదేరి చాలా దూరం వెళ్ళి అక్కడ ఒక కొండ గుహలో దాక్కున్నాడు.

తెల్లవారేసరికి శత్రువులు రాజును వెతుక్కుంటూ ఆ గుహదగ్గిరికి వచ్చారు. అయితే సాలీళ్ళు ఆ గుహకు అడ్డంగా గూడు అల్లిన కారణంచేత అందులో ఎవరూ ఉండి ఉండరనుకుని వారు వెళ్ళిపోయారు.

అప్పుడు అంగపాలుడికి తన తప్పు తెలిసివచ్చింది.

దోమలు తనను నిద్ర లేపి శత్రుభయం ఉన్నదని తెలుసుకోవటానికి ఎంతో ఉపయోగపడ్డాయి. సాలీళ్ళు సాక్షాత్తూ అతడి ప్రాణాలనే కాపాడాయి.


"ఇందువల్ల సృష్టిలో పనికిరానిదంటూ లేనేలేదని రుజువయిందిగదా?" అన్నాడు తాతయ్య.





"అన్యాయం సార్—నూటికి సున్నా మార్కు లిచ్చారా?"

"నిజమే. అన్యాయమే—ఏంచేస్తాం మరి—సున్నాకన్న తక్కువ ఇంకేం లేదుగదా."



"వేధవ వెధవాని—ఇందాక వా డద్దు పడకపోతే ఆ సుబ్బిగాణ్ణి చితగ్గొట్టి చింతకాయ పచ్చడి చేసేవాణ్ణి."

"ఎవ డడ్డుపడ్డాడు?"

"ఇంకెవడూ—వాడే ఆ సుబ్బిగాడే."



"మా ఇద్దరిపేర్లూ నూరేసిసార్లు ఇంపోజిషన్ రాయమండం చాలా అన్యాయం సార్. వీడు ఉత్త 'రాము'. నా పేరేమో వీర వెంకట సత్యనారాయణ వర ప్రసాదమూర్తి...."



"మీ నాడి దివ్యంగావుంది. మరేం భరవా లేదు. గడియారంలాకొట్టుకుంటోంది."

"మీరు నా వాచి మీదనే చెయ్యిపెట్టి నాడి చూస్తున్నారు."

చిత్రకారుడు: ఎస్. శంకర నారాయణ



మేవార్ సింహం

రాజపుత్రులు సూర్యవంశానికి చెందినవారు. అత్యుత్తమమైన దేశాభిమానమూ, క్షత్రియ ధర్మమూ వారిలో చివరిదాకా నిలిచి ఉండింది. మన దేశంలో మొగలాయీల పరిపాలన సాగక పూర్వం ఎందరో రాజపుత్ర వీరులు తమ శౌర్య పరాక్రమాల తోనూ, త్యాగబుద్ధితోనూ చరిత్ర ప్రసిద్ధి సంపాదించుకున్నారు. వారిలో మహారాణా ప్రతాపుడు చాలా గొప్పవాడు. అతనే మేవార్ సింహం.

రాణా ప్రతాపసింహుడు మేవార్ రాజ్యానికి అభిషిక్తుడు కావటానికి నాలుగేళ్ళు పూర్వమే—1572 లో—మేవార్ రాజధాని అయిన చిత్తోర్ మొగలుల వశమయింది. అయినప్పటికీ ప్రతాపసింహుడు ఆరావళీ పర్వతాలలో రాజధాని ఏర్పరచుకుని మొగలాయీ సేనలు మేవార్‌ను ఆక్రమించకుండా నిరోధించుతూ వచ్చాడు.

ఆనాటి మొగలాయి చక్రవర్తి అక్బరు. ఆయన రాణా ప్రతాపసింహుణ్ణి తప్ప మిగిలిన రాజపుత్ర రాజులందరినీ తనకు సామంతులుగా చేసుకున్నాడు. ప్రతాపసింహుణ్ణి ఆయన తన ఆస్థానానికి ఆహ్వానించాడు, కాని పౌరుషవంతుడైన ప్రతాపుడు అక్బరుకు సామంతుడు కావటానికి సమ్మతించలేదు. దేశ స్వాతంత్ర్యానికిగాను ఎందరు రాజపుత్రులు తమ రక్తాన్ని ధార పోశారో, ఎంతటి సాహసమైన త్యాగాలు చేశారో ఆయన మరిచిపోలేదు. ఇంత జరిగాక తాను అక్బరుకు సామంతుడై సౌఖ్యాలలో ఓలలాడటంకంటె స్వేచ్ఛకోసం అష్టకష్టాలూ పడుతూ పోరాడి వీరమరణం పొందటం మేలని ఆయనకు అనిపించింది.

అక్బరును యుద్ధంలో ఎదిరించి జయించటం దాదాపు అసంభవం. రాజపుత్ర వీరులందరూ అక్బరుకు సామంతులు;



ప్రతాపసింహుడి తమ్ముడు శక్తిసింహుడే అక్బరు ఆస్థానంలో ఉన్నాడు. అక్బరుతో పోరాడటమంటే వీరందరితోనూ పోరాడటమే! తానా ఒంటరిగాడు; యుద్ధాల మూలంగా మేవార్ దేశం పంటలుకూడా లేక పాడుపడి ఉన్నది; ప్రతాపసింహుడికి చెప్పుకోదగిన సేన లేదు, డబ్బు అసలే లేదు.

అయినా ప్రతాపసింహుడు నిరుత్సాహం చెందలేదు, విజయం గురించి కలలు కనటం మానలేదు. దానికి తగ్గట్టుగా ఆయన ప్రజలు ఆయనపట్ల అపారమైన విశ్వాసం కనబరిచారు. వారిలో కొందరైనా మొగలాయీల వంచనకు లోబడి రాజద్రోహం తలపెట్టి ఉండవచ్చు—కాని ఒక్కడుకూడా అలా చేయలేదు.

ఆ కాలంలో సూరత్ విదేశీ వాణిజ్యంలో చాలా ప్రముఖ కేంద్రంగా ఉండింది. వర్తక సామగ్రితో విదేశీ బిడార్లు మేవార్ సరిహద్దు మీదుగా వెళుతూ ఉండేవి. ప్రతాపసింహుడి సర్దార్లు ఈ బిడార్లను దోచసాగారు. ఆ దారిన వెళ్ళటం వర్తకులకు హడలయిపోయింది, సూరత్ రేవు మూసివెయ్యవలిసి వచ్చింది; కాని ప్రతాపసింహుడికి కావలిసిన ధనం మటుకు లభించింది. ఆయన ఆరావళీ పర్వతాలలోని తన కమల్మేరు దుర్గాన్ని బాగా బలపరుచుకున్నాడు. ఆ ప్రాంతంలోని భిల్లులు ఆయనకు అండగా నిలబడి, మొగలాయీ సేనలు తమపైకి వస్తే ఎదిరించి పోరాడటానికి అవసరమైన శిక్షణ పొందారు. కొండదారుల వెంబడి శత్రుసైనికులు వచ్చేటప్పుడు వారిపై దొర్లించటానికి వారు రాళ్ళను పేర్చి ఉంచారు.


ఇలా ఉండగా ఒక సంఘటన జరిగింది. అక్బరు ప్రధాన సేనాని అయిన రాజా మానసింహుడు దక్కనులోని షొలాపూరు జయించి తిరిగి వస్తూ మహారాణాను చూసిపోవటానికి వచ్చాడు. ఉదయ సాగర సరస్సు ఒడ్డున గొప్ప విందు ఏర్పాటయింది.

కాని ప్రతాపసింహుడు ఎంతకూ రాలేదు. తనను ఆయన అవమానించాడని మాన సింహుడికి అనిపించింది. ఆయన ఆగ్రహా వేశంతో వెళ్ళి అక్బరు పాదుషాతో తనకు జరిగిన అవమానం గురించి చెప్పాడు.

తన ప్రధాన సేనానికి జరిగిన ఈ అవ మానానికి ప్రతీకారం చెయ్యకపోతే తన సామంతులైన ఇతర రాజపుత్రులకు తనపై గౌరవం పోతుందని గ్రహించి అక్బరు, తన కుమారుడైన సలీమునూ, మాన సింహుణ్ణీ నాయకులుగా నియమించి అనేక లక్షల సంఖ్యలో సైనికులను మేవారుపైకి పంపాడు. ఈ సేనలు 1576 జులైలో ఆరా వళీ పర్వతాలలో ప్రవేశించి హల్దీఘాట్ కనుమలో రాజపుత్ర బలాలను ఎదుర్కొన్నాయి.

ప్రతాపసింహుడి వెంట 22 వేలమంది సైనికులు మాత్రమే ఉన్నారు. రోజల్లా అతి దారుణమైన యుద్ధం జరిగింది. రాజ స్థానంలో అంతకంటె భీభత్సమైన యుద్ధం ఎన్నడూ జరగలేదని చెబుతారు. ఈ యుద్ధంలో ప్రతాపసింహుడి సైనికులు 14 వేలమంది బలి అయారు; మొగలాయీ సేనలలో జరిగిన నష్టం ఇంకా హెచ్చు.

ప్రతాపసింహుడు సాహసోపేతంగా పోరాడి బాగా గాయపడ్డాడు. ఆయన చేతిలో




సలీముకు వెంట్రుకవాసిలో చావు తప్పింది. ప్రతాపసింహుడే ప్రాణాపాయ స్థితిలో ఉండగా ఆయన సర్దారొకడు శత్రువులను మభ్యపెట్టటానికి ఆయన రాజలాంఛనాలను బలాత్కారంగా తీసుకుని తాను ధరించి ఇంకొక దిక్కుగా పారిపోసాగాడు. శత్రువులు అతనిని ప్రతాపసింహు డనుకుని ఎదిరించి చంపారు. కాని ప్రతాపసింహుడు మటుకు తనను చుట్టుముట్టిన శత్రువుల మధ్యనుంచి బయట పడగలిగాడు.

యుద్ధరంగంనుంచి పారిపోతున్న ప్రతాపసింహుణ్ణి ఇద్దరు మొగలు సర్దార్లు చూసి గుర్తించి వెంబడించారు. ప్రతాపుడి గుర్రం "చేతక్" అప్పటికే అలిసిపోయి ఉన్నది. ఆరోజే ప్రతాపసింహుడు ఆ మొగలు సర్దార్ల చేత చావవలిసింది, కాని ప్రతాపుడి తమ్ముడైన శక్తిసింహుడు ఎక్కడినుంచో వచ్చి మొగలు సర్దారులనిద్దరినీ చంపి తన అన్నను రక్షించాడు. ఇద్దరూ ఆలింగనం చేసుకున్నారు. శక్తిసింహుడు ఇకముందు తన అన్న పక్షాన ఉండేటట్టు ప్రమాణం చేశాడు.

అన్నదమ్ములిద్దరూ కలుసుకున్న చోటనే "చేతక్" పడిపోయి ప్రాణాలు వదిలింది. ప్రతాపసింహుడు తన తమ్ముడి గుర్రాన్ని, "ఓంకార్" అనేదాన్ని ఎక్కి కొండలలోకి వెళ్ళిపోయాడు. "చేతక్" పడిపోయిన చోట





ఇప్పుడొక స్మారకచిహ్నం, అరుగులాటిది ఉన్నది. ఇది హల్దీఘాట్‌కు పదిమైళ్ళ దూరాన ఉన్నది.

వానాకాలం గడవనిచ్చి మొగలు బలాలు కమల్మేరు దుర్గాన్ని ముట్టడించాయి. దుర్గం లోని నూతిలో ఎవరో విషం కలిపారు. ఆ కారణంచేత ప్రతాపసింహుడు దుర్గంలో నిలవటం అసాధ్యమయింది. ఆయన తన కుటుంబంతోసహా కొండలపాలూ, అడవుల పాలూ అయి హరిశ్చంద్ర నలమహారాజులు పడిన కష్టాలన్నీ పడ్డాడు.

ఆ దశలోకూడా ఆయనకు ప్రతీకార చింత పోలేదు. మొగలు బలాలు దొరికి నప్పుడల్లా నిర్మూలిస్తూ ఉండేవాడు. మొగలు సేనానాయకులలో ఒకడైన ఫరీద్‌ఖాన్ అనే వాడు మహారాణా ప్రతాపునుగాని, ఆయన శవాన్నిగాని పట్టి తెస్తానని మహమ్మదు ప్రవక్తపై ఒట్టుపెట్టుకున్నాడు. కాని దైవికంగా ఈ ఫరీద్‌ఖాన్ ఖందీగా దొరికిపోయి ప్రతాపుడి ఎదట నిలబడే దుస్థితి ఏర్పడింది. ప్రతాపుడు అతన్ని ఏమీ చెయ్యక నిరాయుధుణ్ణి చేసి పంపేశాడు.


ఇలాగే మరొకసారి ఖాన్ ఖానా అనే ఒక గొప్ప మొగలు సామంతు అంతఃపుర స్త్రీల బృందం ప్రతాపుడి మనుషులకు ఖైదీలుగా దొరికారు. మహారాణా వారిని ఎంతో మర్యాదగా ఆదరించి, రక్షకులను వెంట ఇచ్చి ఖాన్ ఖానా వద్దకు పంపాడు. ప్రతాపుడి ఔదార్యాన్ని మెచ్చుకుంటూ ఖాన్ ఖానా రచించిన గీతాలు ఇప్పటికీ ఉన్నాయి. ఈ గీతాలను అక్బరుపాదుషా కూడా చదివాడు.

ఈ రోజులలోనే ఒక మేవార్ కవి పాదుషా కొలువుకు వెళ్ళి అక్బరు ముందు వంగి సలాము చేసేటప్పుడు తన తలపాగా తీసేశాడట. అలా చేశావేమని అక్బరు అడిగితే, "ఈ తలపాగాను నాకు మహారాణా ప్రతాపసింహుడు బహూకరించాడు. ఆయన ఎవరికీ తల వంచినవాడు కాదు. ఆయన

ఇచ్చిన తలపాగాను నా తలతోబాటు ఎలా వంచను?" అని అడిగాడట. వెంటనే అక్బరు సంతోషించి నిండు దర్బారులోనే మహారాణా శౌర్య పరాక్రమాలను ప్రశంసించాడట.

అయినా కొండలలో భిల్లుల మధ్య ప్రతాపసింహుడు దుర్ఘటమైన జీవితం గడుపుతున్నాడు. ఆయన భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉన్నది. ఈ స్థితిలో ఆయన అక్బరుతో సంధి చేసుకున్నట్టయితే ఆయన కష్టాలు గట్టెక్కుతాయి. సంధి చేసుకోక తాను సాధించేది ఏమీ లేదనికూడా ఆయనకు తోచి ఉండవచ్చు.

ఏమైనప్పటికీ, ప్రతాపసింహుడు సంధికి సుముఖుడుగా ఉన్నాడన్న వార్త వేగుల వారి ద్వారా అక్బరుకు చేరింది. అక్బరు ఆనందానికి మేరలేదు. ఆయన విందులూ వేడుకలూ జరిపించాడు. కాని అక్బరువద్ద ఖైదీగా ఉన్న రాజపుత్ర యువకులలో పృథ్వీరాజు అనేవాడు ఈ పుకారు నమ్మక, "ప్రతాపసింహుడు మొగలు సామ్రాజ్యమంతా ఇచ్చినా రాజీకి ఒప్పుకోడు!" అన్నాడు. అక్బరు పంపుతున్న రాయబారి చేతికి అతను కొన్ని పద్యాలు రాసి ఇచ్చాడు. ప్రతాపసింహుడు. ఆ పద్యాలను చదువు



కుని ఆవేశపూరితుడై, "పాదుషాతో నేను రాజీపడటం అసంభవం," అని రాయబారితో చెప్పేశాడు.

మేవారును తిరిగి గెలుచుకునే ఆశ పూర్తిగా అంతరించటంవల్ల ప్రతాపసింహుడు తన దేశాన్ని విడిచిపెట్టి సింధూనది అవతల ఏదైనా రాజ్యం స్థాపించుకుందామని ఆలోచన చేసి సకుటుంబంగా బయలుదేరాడు.

ఈ పరిస్థితిలో ఆయనకు ఒక కొత్త అప్పుడు తటస్థపడ్డాడు. ఈ వ్యక్తి భామా షా అనే సంపన్నుడు, ఉదయపూరు నివాసి. ఆయన దేశంకోసం తన సర్వస్వాన్నీ ధార

పోయి నిశ్చయించుకుని, గుర్రంపైన మహారాణాను వెతుక్కుంటూ సింధూనదికేసి బయలుదేరాడు. ఆయనకు మహారాణా అందాడు. భామా షా తన ధనాగారపు తాళపుచెవుల గుత్తిని ప్రతాపసింహుడి కాళ్లవద్ద పెట్టి, "మేవారుకు విమోచనం కలిగించండి!" అని ప్రార్థించాడు. అతని కోరికను నిరాకరించటం ప్రతాపసింహుడికి అసంభవమయింది.

భామా షా అంతులేని ధనాన్ని కురిపించాడు. ప్రతాపసింహుడు దాని సహాయంతో గొప్ప బలాన్ని సమకూర్చుకుని చడీ చప్పుడూ లేకుండా మేవారుపైకి తరలి వచ్చాడు. మొగలులు ఈ దాడి జరుగుతుందని కలలోకూడా ఊహించలేదు; ప్రతాపసింహుడు సింధూనది దాటి వెళ్లిపోయాడనే వారి ఉద్దేశం. ప్రతాపసింహుడు ఒక్కొక్క మొగలు సైనిక శిబిరంపైనే పడి అక్కడి బలాలను నిర్మూలించాడు. కమల్మేర్ సైనిక శిబిరంలోని మొగలు సైనికులలో ఒక్కడుకూడా ప్రాణాలతో మిగలలేదు. త్వరలోనే చిత్తోర్, మండల్‌ఘర్ దుర్గాలు తప్ప మిగిలిన దుర్గాలన్నీ తిరిగి ప్రతాపసింహుడికి చేజిక్కాయి. 1586 ఆఖరుకల్లా మేవార్‌లోనుంచి శత్రువులు చాలావరకు తరిమివేయబడ్డారు. ప్రతాపసింహుడు రాజా మానసింహుడి రాజ్యాన్నికూడా కొల్లగొట్టాడు.

ఆ సమయంలో అక్బరు బెంగాలులోనూ, ఇతరత్రా జరిగే తిరుగుబాట్లతో సతమతమవుతూండటంవల్ల మేవార్ జోలికి రాలేదు. ప్రతాపసింహుడు తనకు తోడ్పడిన సర్దార్లకు జాగీర్లిచ్చి బహూకరించాడు. ఆయన కనిన కలలు వాస్తవమయాయి. 1596 దాకా మేవారును ఆయన అవిఘ్నంగా పాలించి ఆ తరవాత కన్నుమూశాడు.

ఈనాటికీ మహారాణా ప్రతాపసింహుడి అసమాన శౌర్య పరాక్రమాలను గురించీ, వీరకృత్యాలను గురించీ పాటలు పాడతారు.



బూరెలమూకుడు పిల్ల





కైరోనగరంలో గోహా అనే పేరుగల ప్రసిద్ధ హాస్య గాడు వుండేవాడు. అతడికి ఒక రోజున బూరెలు తినాలనిపించింది. పొరుగింటికి వెళ్ళి ఇంటివాణ్ణి బూరెల మూకుడు అరువడిగాడు. ఇంటివాడు బూరెల మూకుడు తెచ్చి గోహాకు ఇచ్చాడు.







గోహా తనకు కావలిసినన్ని బూరెలు వండుకుని తృప్తిగా తిన్నాడు. తరవాత ఆ బూరెల మూకుడులో ఒక బుల్లి బూరెల మూకుడు పెట్టి పొరుగింటి వాడికి ఇచ్చేస్తూ, "మీ బూరెల మూకుడు పిల్లను పెట్టింది," అన్నాడు.

పొరుగింటి వాడికి ఆశ పుట్టి తన బూరెల మూకుడును మళ్ళీ గోహాకు అరువిచ్చాడు. కాని అది మళ్ళీ తిరిగి రాలేదు. పొరుగింటివాడు వెళ్ళి తన బూరెల మూకుడు అడిగేసరికి గోహా, "నీ బూరెల మూకుడు చచ్చిపోయింది. పుట్టినదానికి చావు తప్పదుగదా!" అన్నాడు.



దీపం ఆత్మకథ



మాది సూర్యవంశం. అగ్ని మా ఇష్టదేవత. మా సహాయంతోనే అంధకార యుగపు మానవులు ముందుకు నడిచారు. మమ్మల్ని చూస్తే చీకటి బెదిరి పారిపోతుంది.... నేను దీపాన్ని!

మా కులదేవత అయిన అగ్నిదేవుడికి సర్వభక్షకుడనే బిరుదు ఉన్నది. కాని మేము కొద్ది ఇంధనాలను మాత్రమే అరగిస్తాం. ఇంధనం ఏదైనప్పటికీ దానిలో సూర్యుడి శక్తి చేరి ఉన్నట్టయితేనే మాకు ఉపయోగపడుతుంది.

ఆదికాలంనాటి మానవులు మమ్మల్ని ఎరగరు. మావల్ల పొందే ప్రయోజనాలకోసం అగ్నినే ఆశ్రయించేవారు. తనవల్ల మనుషులకు ప్రయోజనం పరిమితంగా ఉన్నదని గ్రహించి అగ్నిదేవుడే వారికి మమ్మల్ని ప్రసాదించాడు.

మమ్మల్ని ఆ కాలపు మానవులు దివిటీల రూపంలో తమవెంట తీసుకుపోయి చీకటిని జయించారు, తాము పనిచేసే కాలాన్ని పెంచుకున్నారు, తమ జీవితాలను విస్తరించుకున్నారు. మేము చేసిన మేలుకు వారు మాపట్ల ఎంతో భక్తీ, కృతజ్ఞతా చూపారు. మమ్మల్ని జ్ఞానానికీ, వికాసానికీ చిహ్నాలుగా చెప్పుకున్నారు.

మా సహాయంతో మనుషులు చీకటిని పారదోలి తమ పనులు చేసుకోవటమే గాక, అగ్నిని ఎప్పటికప్పుడు సృష్టించుకోగలిగారు కూడా. అంతకుపూర్వం నిత్యాగ్నిహోత్రం విధిగా ఉండవలిసివచ్చేది. మేము అగ్ని





కన్న తక్కువ ఇంధనం కోరతాం, తక్కువ వేడి కలిగిస్తాం, ఎక్కువ కాంతి నిస్తాం. అందుచేత నిత్యాగ్నిహోత్రం ఉంచుకునే దానికన్న నిత్యదీపం ఉంచుకోవటం మనుషులకు ఎక్కువ సౌకర్యంకదా!

మేము మనుషులకు ఎన్నివిధాల ఉపయోగపడ్డామో చెప్పటం తేలికకాదు. చీకటిలో అంతబాగా చూడలేని జంతువులను మనుషులు మా సహాయంతో వేటాడారు. రాత్రివేళ సంచరించే క్రూరమృగాలను మా సహాయంతో భయపెట్టారు.

* * *

మనుషులతోనూ, జీవితంతోనూబాటు మేముకూడా పరిణామం చెందాం. ముందు దివిటీల రూపంలో ఉండేవాళ్ళం. పీచును చమురులో ముంచి ఏ కర్రకో చుట్టి వెలిగించేవారు. తరవాత కర్రలకు బదులు కంచుకాగడాలు వచ్చాయి.

కాగడాలూ దివిటీలూ గృహదీపాలుగా పనికిరావు. వాటిలో ఇంకా అగ్ని అంశ జాస్తిగా ఉన్నది; పొగ జాస్తి. గృహదీపాలు అయినాక మా అందం హెచ్చింది. కాల్చిన మట్టి ప్రమిదెలలో చమురు పోసి అందులో వత్తి వేసి వెలిగిస్తే మేము మంచి కాంతితో, పొగ లేక మండుతూ ఎంతో ఆకర్షవంతంగా ఉండేవాళ్ళం. మమ్మల్ని చూస్తే ఆకాలపు వాళ్ళకు—మరీ ఆడవాళ్ళకు—ఎంత ముద్దంటే ఎవరన్నా చక్కనివాళ్లను చూసినప్పుడు, "ఎంత అందమే! చితిపి దీపం పెట్టవచ్చు!" అనేవాళ్ళు.





మేము మనుషుల కళ్ళకు అందంగానే గాక చల్లగా ఉండేవాళ్ళం. అందుకే మా సెగకు చేతులు పట్టి కళ్ళకద్దుకునేవారు. ఇందువల్ల వాళ్ళు మామీద భక్తి చూపి నట్టూ అయేది, వాళ్ళ కళ్ళకు చలవగానూ ఉండేది.

గృహదీపాలు వచ్చిన తరవాత మాకోసం ఎంతెంత అందమైన ప్రమిదెలూ, సెమ్మాలూ తయారుచేశారో మీరు ఊహించలేరు. పేదలు మట్టి ప్రమిదెలతో సరిపెట్టుకున్నప్పటికీ సంపన్నులు కంచుతో దీపపు కుదుళ్ళూ, బుడ్డీలూ, సెమ్మాలూ తయారుచేశారు. ఒకే సారి నాలుగైదు వత్తులు వెలిగించే కుదుళ్ళుండేవి. అనేక వత్తులు వెలిగించటానికి వీలైన సెమ్మాలుండేవి.

ఏనాడో ఇరవైనాలుగు శతాబ్దులక్రితం కూడా రోముదేశంలో ఎంతో అందమైన పాత్రలు, పింగాణీ చేసిన మట్టిపాత్రలు, దీపాలుగా ఉపయోగించేవారు. వాటిమీద రకరకాల బొమ్మలూ, దృశ్యాలూ మలిచే వారు. వాటిని పట్టుకు తీసుకుపోవటానికి వీలుగా ఉంగటాలు ఏర్పాటు చేసేవారు.

అన్నట్టు, ఆ కాలంలోనే మమ్మల్ని ఒక రకం గడియారాలుగా ఉపయోగించే వారంటే మీరు నమ్మగలరా? ఏథెన్స్‌లో ఎక్రాపలిస్ అనే ఆలయం ఉండేది. అందులో బంగారంతో చేసిన దీపంలో అఖండం వెలుగుతూఉండేది. పాత్రనిండా చమురు పోస్తే అఖండం పూర్తిగా ఏడాది పాటు వెలిగేది. వాళ్లు ఏటా ఒకే రోజున





పాత్రను నింపేవారు. ఇందువల్ల వారికి ఆ అఖండంలోని నూనెనుబట్టి కాలమానం తెలిసేది!

ఆ కాలపు రోమనులే మమ్మల్ని సులువుగా లాంతర్లు చేసేశారు. లాంతర్లను వాళ్లు కంచుతో తయారుచేసి, జ్యోతి ఆరిపోకుండా అద్దాలు అమర్చి, పైనుంచి పట్టుకునేటట్టుగా ఏర్పాటుచేసి ఎక్కడికైనా తీసుకుపోవటానికీ, దూలాలకు తగిలించటానికీ వీలుగా చేసుకున్నారు.

లాంతర్లు వచ్చాక వాటిపైన చాలా శతాబ్దాలపాటు మానవులు తమ పనితనమంతా ప్రదర్శించారు. ముఖ్యంగా చీనా, జపాను దేశాలవాళ్లు లాంతర్లు చేసే విద్యను ఒక కళగా అభ్యసించారు.

లాంతర్లను మరింత కాంతివంతంగా చెయ్యటానికి బర్నర్లూ, గాజు చిమ్నీలూ, కాంతిని ప్రతిఫలించే అద్దాలలాటి రేకులూ అవీ కనిపెట్టారు....

మేము ఉపయోగించే ఇంధనాలలో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. మొదట్లో ఆముదం, నువ్వుల నూనె మొదలైన నూనెలూ, కొవ్వుపదార్థాలూ వాడేవారు.

ఆ తరవాత కిరసనాయిలు అనే మట్టి నూనె వచ్చింది. లాంతర్లు అభివృద్ధి కావటం చేత మట్టినూనె మంచి ఇంధనం అనిపించుకున్నదే గాని నిజానికి అది నూనెలంత మంచి ఇంధనం కాదు.

కొవ్వూ మైనమూ గట్టి ఇంధనాలు. మైనపు వత్తులను ఎక్కడికైనా సులువుగా





పట్టుకుపోవచ్చు. నూనెలాగా వాటికి పాత్రలు అక్కర్లేదు.

తరవాత వాయు ఇంధనం వచ్చింది. మట్టినూనెనే వాయురూపంలోకి మార్చి దాని సహాయంతో గాస్‌లైట్లవంటివి వెలిగిస్తే తెల్లని, దేదీప్యమైన కాంతి వస్తుంది.

ఆ తరవాత అన్నిటికన్నా చిత్రమైన ఇంధనం వచ్చింది. అది విద్యుచ్ఛక్తి. విద్యుద్దీపాలు ఇప్పుడు మాలోకెల్లా చాలా గొప్ప దీపాలు. వీటిల్లో ఎన్ని కులాలు! ఫిలమెంటు దీపాలనీ, ట్యూబ్ దీపాలనీ, ఆర్క్ లైట్‌లనీ—ఎన్నో రకాలు, రంగు రంగులుగా వెలిగేవి—ఉన్నాయి.

అసలు కాంతి అంటే విద్యుద్దీపాలదే కాంతి! వీటిలో కళ్లు చెదిరే కాంతి గలవి ఉన్నాయి, అనేక మైళ్లదూరం కాంతిని ప్రసరించగలవి లైట్ హౌసెస్‌లో, సెర్చిలైట్ల రూపంలో ఉన్నాయి.

స్టూడియోలలో సినిమాలు తియ్యటానికీ, థియేటర్లలో సినిమాలు చూపటానికీ చాలా కాంతివంతమైన దీపాలను ఉపయోగిస్తున్నారు. ఈనాడు దీపాలను ఎన్ని లక్షల విధాలుగా ఉపయోగిస్తున్నారో మీరు ఊహించనుకూడా లేరు.

మాలో కొన్ని క్షణిక దీపాలు! మీ ఇంట్లో టార్చిలైట్ ఉన్నదా? అది అవసరమైతేనే వెలిగి ఆరిపోతూ ఉంటుంది. సిగెరెట్‌లు వెలిగించే లైటరు చూశారుగదా—అదొక క్షణిక దీపం. ఒక సెకండులో వెయ్యోవంతు సేపు మాత్రమే వెలిగే ఫ్లాష్‌లైట్లను ఫోటోలు







తీసేవాళ్లు ఉపయోగిస్తున్నారు....మనుషులలో ఉన్నన్ని కులాలు ఈనాడు మాలోనూ ఉన్నాయి!....

మాకూ మీకూ అనాదిగా ఉన్న సంబంధంలో మాత్రం మార్పేమీ లేదు. మమ్మల్ని చూడగానే మీ మనసు పొంగిపోతుంది; మీకు సంతోషం పొంగివచ్చినప్పుడల్లా మమ్మల్ని పెట్టుకుని దీపోత్సవం చేసుకుంటారు.

పెళ్ళిళ్ళూ, వేడుకలూ జరిగినప్పుడు, చూడండి, మామూలుకన్న ఎంత హెచ్చుగా దీపాలు వెలిగిస్తారో!

ఎన్నో దేశాలలో దీపోత్సవాలు ఏటా జరుగుతాయి. ఈ దేశంలో దీపావళి అలాటి పండగ. చీనాలో సంవత్సరాది తరవాత వచ్చే పూర్ణిమనాడు దీపోత్సవం చేస్తారు. ఈ దేశంలోకూడా కొన్ని ప్రాంతాల కార్తిక పూర్ణిమనాడు దీపోత్సవం జరుపుకుంటారు.

క్రీస్తు పూర్వం అయిదో శతాబ్దంలో రోములో ఉండిన హిరోడోటస్ అనే ప్రసిద్ధ చరిత్రకారుడు ఈజిప్టు దేశంలోని సయీస్ అనేచోట ఒక దీపోత్సవం చూసి ఆశ్చర్యపడ్డాడట—రోమనులు దీపోత్సవాలు ఎరగరులాగుంది. ఆయన అన్ని దీపాలు ఒక్కసారిగా చూడలేదట.

ఈ దేశంలో మటుకు ఇది అనాదిగా వస్తున్న ఉత్సవం. ఇదుగో మళ్ళీ వచ్చింది! ఉల్లాసంగా పండగ జరుపుకోండి—మేమంతా వచ్చి వేడుక చేస్తాం; వేడుక చూస్తాం!



తగిన ఆతిథ్యం





గోహా భోజనప్రియుడు. ఒకనాడు ఎరిగున్నవాడొకడు అతనికొక కోడిని దానం చేశాడు. గోహా ఎంతో సంతోషపడి, ఆ కోడిని వండించి, కృతజ్ఞతాపూర్వంగా ఎరిగున్నవాణ్ణి భోజనానికి పిలిచాడు. భోజనం చేసి అతిథి వెళ్ళిపోయాడు.




కాస్సేపటికి ఆ అతిథి పక్క ఇంటివాడు వచ్చి తలుపు తట్టాడు. గోహా అతనికి కూడా భోజనం పెట్టి పంపాడు. తరవాత ఇంకోడు హడావిడిగా—

"మీకు కోడి ఇచ్చినవాడి స్నేహితుడి స్నేహితుణ్ణి!" అంటూ గదిలోకి ప్రవేశించాడు. "అలాగా. చాలా సంతోషం. ఇది ఆ కోడిని ఉడకబెట్టిన నీరుకు చెల్లెలు! ఆరగించండి!" అన్నాడు గోహా.



స్వర్ణదేవాలయం - అమృతసర్

సిక్కు మతస్థులకు ప్రధానమయిన స్వర్ణ దేవాలయం పంజాబులోని అమృతసర్‌లో వున్నది. సిక్కుల నాలుగవ గురువైన రామదాసు అక్బరు చక్రవర్తినుంచి యిప్పటి అమృతసర్ పట్టణం వున్న ప్రదేశాన్ని సంపాదించి, అక్కడ ఈ పవిత్రమైన స్వర్ణ దేవాలయానికి పునాది వేశాడు. తరవాత గురు అర్జునదేవ్ సరస్సు తవ్వించి, దాని మధ్య దేవాలయాన్ని నిర్మించాడు. పంజాబును ఏలిన సిక్కు మతస్థుడు రంజిత్‌సింగ్ (1780 - 1839) ఈ దేవాలయ గుమ్మటానికీ, కలశానికీ రాగితొడుగులు చేయించి, వాటి మీద బంగారు రేకు తాపడం చేయించాడు.

ఈ స్వర్ణదేవాలయంలో ఒక పట్టు అచ్ఛాదనంకింద సిక్కుల పవిత్ర మతగ్రంథం—గ్రంథ్ సాహెబ్—వుంచబడింది. గురు-కా-బాగ్ అన్న చోట సిక్కు మతస్థాపకుడైన గురునానక్ జీవిత చరిత్రకు సంబంధించిన చిత్రాలు అనేకం చిత్రించబడి వున్నవి.

స్వర్ణదేవాలయానికి దాదాపు యాభై గజాల దూరంలో, 'అకాల్‌తక్త్' అన్న పేరు గల భవనం వున్నది. ఇది సిక్కు మతస్థులకు ఎంతో చరిత్ర ప్రాముఖ్యత గల కట్టడం. ఇక్కడనే సిక్కు గురువులు సభ తీర్చి, మతానికి సంబంధించిన వివిధ సమస్యలపై చర్చలు చేసి, తీర్పులిస్తూండేవారు.





పూర్వం గోదావరీతీరాన ఉండిన ప్రతిష్ఠాన దేశానికి రాజధాని సుప్రతిష్ఠితమనే నగరం. ఆ నగరంలో సోమశర్మ అనే బ్రాహ్మడుండేవాడు. ఆయనకు ఇద్దరు కుమారులూ, శ్రుతార్థ అనే కుమార్తె ఉండేవారు. శ్రుతార్థ అన్నలకు తెలియకుండా కీర్తిసేనుడనే నాగకుమారుణ్ణి గాంధర్వ వివాహం చేసుకుని, గుణాఢ్యుడనే కుమారుణ్ణి కన్నది.


గుణాఢ్యుడు పసివాడై ఉండగానే తల్లీ, మేనమామలూ చనిపోయారు. అప్పుడా కుర్రవాడు దక్షిణదేశానికి పోయి, సకల విద్యలూ నేర్చి, కీర్తిమంతుడై, అనేకమంది శిష్యులను సంపాదించుకుని వారితోకూడా సుప్రతిష్ఠితానికి తిరిగి వచ్చాడు.

ఆ సమయంలో ఆ నగరాన్ని సాతవాహన మహారాజు ఏలుతున్నాడు. నగరమంతా నాగరికతతోనూ, సుఖ సంపదలతోనూ తులతూగుతున్నది. గుణాఢ్యుడు రాజభవనానికి వెళ్లి తన రాక గురించి శిష్యులద్వారా వర్తమానం పంపాడు. అతన్ని ఆస్థానంలోకి రమ్మన్నారు. గుణాఢ్యుడు సాతవాహన మహారాజును ఆశీర్వదించాడు. మహారాజు రత్నసింహాసనంపైన దేవేంద్రుడులాగా కూచుని ఉన్నాడు. ఆయన చుట్టూ ఉండిన సభికులు గుణాఢ్యుడి ప్రతిష్ఠ గురించి రాజుకు తెలిపారు. సాతవాహనుడు సంతోషించి గుణాఢ్యుణ్ణి తన మంత్రిగా నియమించాడు. గుణాఢ్యుడు పెళ్ళి చేసుకుని అక్కడనే సుఖంగా జీవించసాగాడు.

ఈ సాతవాహనుడు దీపకర్ణి అనే రాజుకు దొరికిన పిల్లవాడు. దీపకర్ణిరాజు భార్య పాము కరిచి చనిపోగా, ఆమెమీది ప్రేమ చేత రాజు మళ్ళీ పెళ్ళాడలేదు. కాని తన అనంతరం రాజు కావటానికి కొడుకు లేడే అన్న చింత ఆయనను బాధిస్తూ వచ్చింది. ఇలా ఉండగా ఒకనాడు దీపకర్ణి వేటాడుతూ

వి. వెంకటదాసు





అరణ్యంలో చాలా దూరం వెళ్ళాడు. అక్కడ మిట్టమధ్యాన్నంవేళ ఒక సింహం మీద ఎక్కి వెళుతున్న ఒక కుర్రవాడు కని పించాడు. ఆ సింహం ఎండకు దప్పిగొని ఉండటంచేత బాలుణ్ణి ఒక కొలనుపక్క దించి, కొలనులో నీళ్ళు తాగబోయింది.

ఆ సమయంలో రాజు సింహాన్ని బాణంతో కొట్టాడు.


ఆ కుర్రవాడికి సాతవాహనుడని పేరు పెట్టి దీపకర్ణి పెంచి పెద్దవాణ్ణి చేశాడు. తర వాత సాతవాహనుడు రాజ్యాభిషిక్తుడై పెద్ద సామ్రాజ్యానికి చక్రవర్తి అయాడు.

అయితే సాతవాహనుడికి సంస్కృతం రాదు, పాండిత్యం లేదు. ఇందువల్ల ఆయ నకు చిన్న పరాభవం జరిగింది.

ఒకనాడు సాతవాహనుడు తన రాణు లతో వనవిహారం చేసి జలక్రీడలాడుతూ, ఒక రాణిపై నీళ్ళు కొట్టి పీడించసాగాడు. ఆమె అప్పటికే చాలా బడలి ఉండటంచేత, "రాజా, నన్ను నీటితో కొట్టకు," అనటానికి సంస్కృతంలో, "రాజన్, మోదకై స్తాడయ," అన్నది. ఈ మాటను సంధులు విడదీస్తే "మా ఉదకైః తాడయ" అవు తుంది. కాని రాజుకు సంస్కృతం రాని కారణంచేత, తన రాణి మోదకాలు (అంటే లడ్డూలు) కావాలంటున్నదనుకుని నౌకర్ల చేత లడ్డూలు తెప్పించాడు. వాటిని చూసి ఆ రాణి నవ్వి, "నీకు సంస్కృత సంధులు కూడా తెలియవా?" అని ఆక్షేపించింది.

ఈ ఆక్షేపణావమానంతో సాతవాహనుడు కుంగిపోయి తిండికూడా మాని మనోవ్యాధి పాలయినాడు. రాజుకు అకస్మికంగా కలిగిన ఈ స్థితి అర్థంకాక అందరూ దిగులుపడ్డారు.

శర్వవర్మ అనే మేధావి ఒకడు రాజు కొలువులో ఉన్నాడు. అయనా, గుణా ఢ్యుడూ కలిసి రాజుయొక్క మనోవ్యాధికి కారణం ఆరా తీశారు. వారు రాజు వద్దకు వెళ్ళి నిజం తెలుసుకున్నారు.



సాతవాహనుడు గుణాఢ్యుడితో, "అయ్యా, శ్రద్ధగా చదువుకున్నవాడు పండితుడు కావటానికి ఎంతకాలం పడుతుంది?" అన్నాడు.

"మహారాజా, వ్యాకరణం అన్ని విద్యలకూ మూలం. దానిని సామాన్యులు పన్నెండేళ్ళు చదువుతారు. నేను మీకు ఆరేళ్ళలో చెబుతాను," అన్నాడు గుణాఢ్యుడు.

వెంటనే శర్వవర్మ, "మహారాజా, నేను మిమ్మల్ని ఆరు నెలలలో పండితుణ్ణి చేసేస్తాను," అనేశాడు.

గుణాఢ్యుడు ఈ మాట విని మండిపడి, "నీవే అలా చేయగలిగితే నేను మానవులు వాడుక చేసే సంస్కృత, ప్రాకృత, దేశ భాషలు మూడింటిలోనూ మాట్లాడటం మానేస్తాను!" అని ప్రతిజ్ఞ చేశాడు.

"నేను ఆరుమాసాలలో రాజును పండితుడుగా చేయలేకపోతే పన్నెండేళ్ళపాటు నీ పాదరక్షలు నెత్తిన పెట్టుకుని మోస్తాను," అని శర్వవర్మ ఎదురు ప్రతిజ్ఞ చేశాడు.

ఈ ఇద్దరి వాగ్వాదంతో రాజుకు తాను పండితుడౌతానన్న ధైర్యం చిక్కింది.

ఆరు నెలలలో పాండిత్యం సంపాదించటం ఎవరికీ సాధ్యంకాదని శర్వవర్మ ఎరుగును. అయినప్పటికీ అది సాధ్యం చేస్తానని ప్రతిజ్ఞ చేసినాక ఆయనకు పుట్టెడు దిగులు పట్టుకున్నది. ఆయన తన ఇంటికి వెళ్ళి భార్యతో తాను చేసిన అసాధ్య ప్రతిజ్ఞ గురించి చెప్పాడు.

"మీరు ఈ చిక్కునుంచి బయటపడాలంటే కుమారస్వామి తప్ప మరెవరూ తోడ్పడలేరు. ఆయన అనుగ్రహం పొందండి," అని భార్య చెప్పింది.


భార్య సలహా ప్రకారం శర్వవర్మ మర్నాడు చీకటితోనే లేచి కుమార క్షేత్రానికి బయలుదేరి వెళ్ళాడు. అక్కడ ఆయన నిరాహారిగా ఉంటూ తీవ్రమైన తపస్సు చేసి, కుమారస్వామిని మెప్పించి ప్రత్యక్షం

చేసుకుని, రాజు ఏమీ చదువుకోకుండానే పండితుడయేటట్టు వరం పొందాడు.

రాజుకు సకల విద్యలూ అలవడ్డాయని తెలిసి ప్రజలు తమ ఇళ్ళపై జెండాలు ఎగరవేసి ఉత్సవం చేసుకున్నారు. సాతవాహనుడు శర్వవర్మను తన గురువుగా భావించి పూజించి, నర్మదాతీరాన గల భరుకచ్ఛప దేశానికి అయనను రాజుగా చేశాడు. తనకు పాండిత్యం లేదని నవ్విన రాణిని పట్టపు రాణిగా చేసుకున్నాడు.

రాజభవనంలో గొప్ప సభ జరిగింది. అందులో ఒక బ్రాహ్మడు తాను రచించిన శ్లోకం ఒకటి చదవగా సాతవాహనుడు దానికి అర్థం చెప్పాడు. సభికులు హర్షధ్వానాలు చేశారు.

గుణాఢ్యుడు ఓడిపోయాడు. అతను ఇక సంస్కృత, ప్రాకృత, దేశి భాషలలో మాట్లాడటానికి లేదు. మౌనంగా ఉండి అతను రాచకార్యాలు ఎలా చూస్తాడు. అందుకని, మధ్యాన్నంవేళ సభ చాలించే సమయాన అతను రాజుగారికి వెళ్ళివస్తానని సంజ్ఞచేసి సెలవు పుచ్చుకున్నాడు. తరవాత అతను ఇద్దరు శిష్యులను మాత్రం వెంటబెట్టుకుని, తపస్సు చేసుకునే ఉద్దేశంతో వింధ్యారణ్యాలలోకి వెళ్లిపోయాడు.



అక్కడ అతనికి పిశాచాలు కనబడ్డాయి. గుణాఢ్యుడు ఆ పిశాచాల భాష వింటూ దానిని నేర్చుకుని, మౌనం మానేసి ఆ పైశాచీ భాషలో మాట్లాడనారంభించాడు.

ఈ వింధ్యారణ్యంలోనే ఒక మర్రిచెట్టు కింద పిశాచాల రాజైన కాణభూతి ఉంటున్నాడు. ఈ కాణభూతిని గుణాఢ్యుడు కలుసుకుని పిశాచాల భాషలో కుశలప్రశ్న చేశాడు. ఇద్దరికీ స్నేహమయింది. కాణభూతి గుణాఢ్యుడికి తన పైశాచీ భాషలో ఏడు కథలు చెప్పాడు. వాటిని గుణాఢ్యుడు అదే భాషలో ఏడేళ్ళపాటు తన రక్తంతో రచించి ఏడు లక్షల గ్రంథం తయారుచేశాడు.





గుణాఢ్యుడి శిష్యులైన గుణదేవుడు, నందిదేవుడు అనేవారు ఈ గ్రంథాన్ని సాత వాహన మహారాజుకు అర్పించటం మంచి దని సలహా ఇచ్చారు. గుణాఢ్యుడు అందుకు సమ్మతించి తన గ్రంథాన్ని తన శిష్యుల కిచ్చి సాతవాహనుడి వద్దకు పంపించాడు. తానుమాత్రం నగరంలోని ఒక ఉద్యాన వనంలో రహస్యంగా కూచున్నాడు.

గుణాఢ్యుడి శిష్యులు గ్రంథాన్ని రాజుకు సమర్పించారు. రాజు దాన్ని చూసి, "గ్రంథం చూడబోతే ఇంత ఉన్నది. ఇదేం భాష? ఈ రక్తాక్షరా లేమిటి? ఇది పాడు కథగా ఉన్నదే!" అన్నాడు.

శిష్యులు ఆ గ్రంథాన్ని తిరిగి పుచ్చుకుని ఉద్యానంలో ఉన్న తమ గురువుగారి వద్దకు వెళ్లి జరిగిన సంగతి చెప్పారు. గుణాఢ్యుడు కుంగిపోయాడు. అతను తన శిష్యులతోసహా సమీపాన ఉన్న పర్వతానికి వెళ్ళి అక్కడ ఒక అగ్నిగుండం చేసి తన గ్రంథంలోని ఒక్కొక్క పత్రాన్నే పైకి చదివి ఆ అగ్ని గుండంలో వేయసాగాడు. గుణాఢ్యుడు చదివే గ్రంథాన్ని వినటానికి ఆ చుట్టు పక్కల గల పశుపక్ష్యాదులన్నీ తిండి మాని వచ్చి చుట్టూ మూగాయుట.

కొంతకాలానికి సాతవాహనుడికి నీరసం పట్టుకున్నది. వైద్యులు పరీక్షించి, రాజుగారు తినే వేటమాంసం బలహీనంగా ఉంటున్న దని తేల్చారు. వేటమృగాలు నీరసించటానికి కారణం అవి తిండి మాని గుణాఢ్యుడి రచన వింటూ ఉండటమేనని తెలిసింది.

అదే గ్రంథాన్ని తనకు గుణాఢ్యుడు పంపి నప్పుడు తాను స్వీకరించనందుకు సాత వాహనుడు పశ్చాత్తాపపడి, తానే స్వయంగా బయలుదేరి గుణాఢ్యుడుండేచోటికి వెళ్ళి ఆ గ్రంథాన్ని తన కిమ్మని ప్రాధేయపడ్డాడట. అప్పటికి అరులక్షల గ్రంథం కాలిపోయి లక్ష గ్రంథం మాత్రం మిగిలిందట. అదే బృహ త్కథ, ఈనాటికీ ప్రసిద్ధంగా ఉన్నది.



స్థల పురాణం: బహుమతి పొందిన వ్యాసం

5. సింహాచల క్షేత్రము

సింహాచల క్షేత్రము విశాఖపట్టణమునకు దాదాపు పదిమైళ్ళ దూరమున నున్నది.

కృతయుగమున లోకకంటకుడగు హిరణ్యకశిపుడు, విష్ణుశత్రువై విష్ణుభక్తులను హింసించుచుండెను. అట్టి హిరణ్యకశిపుని కుమారుడయిన ప్రహ్లాదుడు విష్ణుభక్తుడై తండ్రి మాటలను ధిక్కరించగా హిరణ్యకశిపుడు కోపావేశమున కుమారుడనియును ఎంచక, "వీనిని తూర్పు సముద్రమున పడవేయు,"డని అజ్ఞాపించెను. అజ్ఞానుసారము హిరణ్యకశిపుని భటులు ప్రహ్లాదుని తూర్పు సముద్రమున త్రోయగా అతడు శ్రీమన్నారాయణుని ప్రార్థించెను. అప్పుడు శ్రీమన్నారాయణుడు వైకుంఠము నుండి సింహాచల పర్వతముపై కురికి ప్రహ్లాదుని రక్షించి, అతడి నివాసమైన అహోబలమునకు పంపివైచెను.

మరునటి దినమున శ్రీమన్నారాయణుడు అహోబలమునకు పోయి అచ్చట ఉగ్ర నరసింహావతారమును దాల్చి హిరణ్యకశిపుని రొమ్మును చీల్చి వధించెను. పిదప ప్రహ్లాదుని అహోబల సామ్రాజ్యమునకు పట్టాభిషిక్తుని గావించి, "ప్రహ్లాదా! నీ యిచ్ఛ వచ్చినపుడు నీ మనుమడికి ఈ రాజ్యమును వప్పచెప్పి, నిన్ను నీకు దర్శనమిచ్చిన పర్వతమున నీ పినతండ్రి యగు హిరణ్యాక్షుని సంహరించిన వరాహ రూపముతోనూ, నీ తండ్రిని చంపిన నరసింహ రూపముతోనూ ఉన్న నన్ను దర్శించిన, నీకు మోక్షమును ఇచ్చెద,"నని అంతర్థాన మయ్యెను.

తరువాత ప్రహ్లాదుడును వివాహము చేసికొని కొంతకాలమునకు, తన మనుమడికి రాజ్యమును వప్పగించి మోక్షార్థియై భగవంతుని ఆజ్ఞానుసారము సింహాచలమునకు పోయి, శ్రీహరిని ప్రార్థన చేయుగా, ఆయన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామిగా సాక్షాత్కరించెను. ప్రహ్లాదుడు ఆ మూర్తికి సాష్టాంగ దండ ప్రణామములు చేసి భగవన్నిర్మితమయిన ఒక విచిత్రమయిన విమానమున ఆ స్వామిని సుప్రతిష్ఠుని చేసి అచ్చట నొక పట్టణమును నిర్మించెను. భగవదాజ్ఞచే యిచ్చట నేటికిని గంగా యమునా సరస్వతీ మున్నగు నదులు ధారారూపముగా ప్రవహించుచున్నవని చెప్పుదురు

విశ్వం, మద్రాసు - 26.

[బహుమతి మొత్తం రు. 10/- ఈ నెలాఖరులోగా పంపబడుతుంది.]



గుడ్డి జోస్యం

ఒకసారి ఒక పేదవాడూ, వాడి భార్యా పొట్ట చేతపట్టుకుని బాగ్దాదు నగరానికి వచ్చారు. వాళ్లు రోజూ పనికోసం వీధులవెంట తిరుగుతూ ఉండటం చూసి ఒక పెద్ద మనిషి పేదవాడితో, "ఎందుకు రోజూ మీరు వీధులవెంబడి తిరుగుతున్నారు?" అన్నాడు.

"అయ్యా, కూలికోసం తిరుగుతున్నాను," అన్నాడు పేదవాడు.

"ఏదైనా వృత్తి చేసుకోరాదా?" అన్నాడు పెద్దమనిషి.

"ఏం చెయ్యను? నాకే వృత్తీ రాదు," అన్నాడు పేదవాడు.

"అలా అయితే ఒక గొడ్డలి తీసుకుని సుంకాల కచేరీ దగ్గిరికి పోతే కట్టెలు పేళ్లు వేసుకుని నాలుగు డబ్బులు సంపాదించుకో వచ్చునే!" అన్నాడు పెద్దమనిషి.

పేదవాడు మర్నాడు గొడ్డలి తీసుకుని సుంకాలకచేరీ ప్రాంతాలకు వెళ్లాడు. అక్కడ కట్టెలను పేళ్లుగా నరికి అందువల్ల వచ్చిన కొద్ది డబ్బులతో తన పొట్టా, తన భార్య పొట్టా పోషించుకుంటూ కాలం గడపసాగాడు.

ఒకనాడు పేదవాడి భార్య, "ఇదుగో, నేను హమామ్‌కు వెళ్లి స్నానం చేసి రావాలి, డబ్బులుంటే ఇయ్యి," అన్నది భర్తతో.

పేదవాడు డబ్బులు తీసిఇచ్చాడు. భార్య స్నానశాలకు వెళ్లింది. అక్కడ గొప్ప గొప్ప వాళ్లంతా వచ్చి స్నానాలు చేస్తున్నారు. తన పేదరికం తలుచుకుని ఆవిడకు చచ్చే సిగ్గయింది.

ఇంతలో నలుగురూ, "ఆస్థాన జ్యోతిష్కుడి భార్య!" అనుకోవటం విని పేదవాడి భార్య, అందరిలాగే తల ఎత్తి, మెడ నిక్కించి చూసింది. ఆ సమయంలో స్నానశాలలోకి ఆస్థాన జ్యోతిష్కుడి భార్య ఠీవిగా ప్రవేశించింది.

ఆర్. సత్యనారాయణ




"ఛీ, నా బతుకు ఏం బతుకు! పెళ్లామయితే అస్థాన జ్యోతిష్కుడి పెళ్లామే కావాలి!" అనుకుంటూ పేదవాడి భార్య స్నానం చేసి ఇంటికి పోయింది. తన భర్త ఇంటికి రాగానే ఆవిడ "ఇదుగో, నువు వెంటనే ఆస్థాన జ్యోతిష్కుడి వవుతావా? లేక నన్ను వదిలేసి వెళ్లిపోతావా? ఏదో ఒకటి తేల్చుకో!" అన్నది.

పేదవాడు నిర్ఘాంతపోయి, "నాకు చదువే రాదే. నేను ఆస్థాన జ్యోతిష్కుడు కావట మెలాగ?" అన్నాడు.

"అదంతా నాకు తెలీదు. ఆస్థాన జ్యోతిష్కుడివి అయిగాని నీ మొహం నాకు చూపకు!" అన్నది భార్య.

చేసేది లేక పేదవాడు కాగితాలూ, కలమూ, సిరాబుడ్డీ పట్టుకుని స్నానశాల వద్దకు వెళ్లి ద్వారంవద్ద కూచుని, నలుగురికీ కనిపించేలాగా "యంత్రాల" బొమ్మలు గీయసాగాడు.

కాస్సేపట్లో స్నానశాలకు ఖలీఫాయే స్వయంగా వచ్చాడు. అందరూ ఆయన చుట్టూ మూగి అవీ ఇవీ యాచిస్తూండటం చూసి పేదవాడు, "ఏలినవారు ఒక్కసారి ఇలా దయచేస్తారా?" అని ద్వారంవద్ద నుంచి అడిగాడు. ఏ బుద్ధిన ఉన్నాడో



ఖలీఫా స్నానశాలలోనుంచి ద్వారంవద్దకు వచ్చాడు. ఆ క్షణంలోనే స్నానశాల కప్పు కాస్తా కూలిపడింది.

"కాస్త అయితే ఖలీఫాగారి ప్రాణం పోయిఉండేది! ఆ జ్యోతిష్కుడెవడో చాలా గొప్పవాడై ఉండాలి, ఖలీఫాగారికి పెద్ద గండం తప్పించాడు!" అని అందరూ పేదవాణ్ణి మెచ్చుకున్నారు. అక్కడ చేరిన వారంతా తమదగ్గిర ఏదిఉంటే అది పేదవాడికి బహూకరించారు. ఖలీఫా మాట వేరే చెప్పనక్కర్లేదు.

ఈ బహుమానాలన్నిటినీ పట్టించుకుని పేదవాడు ఇంటికి వెళ్లి, "ఓయ్, చూశావా



ఈ బహుమానాలన్నీ?" అన్నాడు సంతోషంతో.

"ఎవడికొక్కవాళ్లి ఈ బహుమానాలు? నువు ఆస్థాన జ్యోతిష్కుడివి అయావా, లేదా? అది ముందు చెప్పు!" అన్నది భార్య.

పేదవాడు బిక్కమొహం వేసి, "ఇంకా లేదు," అన్నాడు.

"అయితే నీ మొహం నాకు చూపించకు!" అన్నది భార్య. పేదవాడు వెళ్ళిపోయి స్నానశాల బయట మళ్లీ తిష్ఠవేశాడు.

ఒకరోజు ఖలీఫాగారి వజ్రపుటుంగరం పోయింది. ఎంత వెతికినా కనిపించలేదు. చివరకు ఎవరో, "ఆ హమామ్ ద్వారంవద్ద కూచునే జ్యోతిష్కుడు చాలా గట్టివాడు. ఖలీఫాగారి ప్రాణాలు కాపాడాడు కూడానూ. ఈ దొంగతనం అతనివల్లనే బయటపడాలి!" అన్నారు.

ఇంకేముందీ? ఖలీఫా పేదవాణ్ణి పిలిపించి తన వజ్రపుటుంగరం ఎక్కడ ఉన్నదీ కనిపెట్టమన్నాడు.

"ఏలినవారు నాకు కొంచెం వ్యవధి ఇవ్వాలి," అన్నాడు పేదవాడు, ఏమి చెయ్యాటానికీ తోచక.

"రెండు రోజులు తీసుకో కావలిస్తే," అన్నాడు ఖలీఫా. ఈలోపల బాగ్దాదు వదిలి పారిపోదామనుకున్నాడు పేదవాడు. కాని ఖలీఫా మనుషులు అతణ్ణి రాజమందిరం లోనే ఒక పెద్ద గదిలో బంధించి అతనికి కావలిసిన ఆహారం వగైరాలన్నీ అక్కడికే తెచ్చిపెట్టారు.

పేదవాడికి మతి పోయినట్టయింది. అతను రోజల్లా కిటికీ దగ్గిర నిలబడి బయట ఉన్న మైదానంకేసి చూస్తూ ఉండిపోయాడు. ఆ మైదానంమీద కొన్ని పెద్ద బాతులు కనిపించాయి. వాటిలో ఒక బాతు కుంటిది. అది జబ్బుగాకూడా ఉన్నట్టు పేదవాడి కళ్లకు కనిపించింది. పేదవాడు దాన్ని చూసి, "ఇదీ, పాపం, నాలాగే ఉంది,"

అనుకున్నాడు. అతను రెండు రోజులూ దాన్నే చూస్తూ ఉండిపోయాడు.

మూడో రోజున ఖలీఫా మనుషులు వచ్చి గది తలుపు తెరిచి, పేదవాణ్ణి ఖలీఫావద్దకు తీసుకుపోయారు. "నా ఉంగరం ఏమయింది? దాని ఆచోకీ నీకేమైనా అంతు చిక్కిందా?" అని ఖలీఫా అడిగాడు.

"ఏలినవారు కరుణించాలి. నేనీ రెండు రోజులూ ఒక కుంటి బాతును తప్ప ఇంకేమీ చూడలేదు," అన్నాడు పేదవాడు.

"కుంటి బాతు" అని అతను అంటుండగానే ఖలీఫా మనుషులు పరిగెత్తుకుంటూ పోయి కుంటి బాతును పట్టుకుని దాని పొట్ట కొయ్యగా, అందులో ఖలీఫా పోగొట్టుకున్న వజ్రపుటుంగరం దొరికింది.

ఆ ఉంగరాన్ని ఒక దాసీది దొంగిలించి, ఎక్కడా దాచటానికి లేక, ఒక బాతుచేత మింగించి, గుర్తుగా ఉండగలందులకు దాని కాలొకటి విరిచింది.

పేదవాడి జ్యోతిష ప్రజ్ఞకు ఖలీఫా మెచ్చుకుని అంతులేని బహుమతులిచ్చాడు. పేదవాడు ఇంటికి పోయి, "ఎలాటి బహుమతులు తెచ్చానో చూడు," అన్నాడు భార్యతో.

"నాకు బహుమతుల మాట చెప్పకు. ఆస్థాన జ్యోతిష్కుడివయావా లేదా?" అన్నది భార్య.



"ఇంకా లేదు," అన్నాడు భర్త విచారంగా మొహంపెట్టి.

"అయితే నాకు నీ మొహం చూపించకు!" అన్నది భార్య.

పేదవాడికి ప్రాణం విసిగిపోయింది. నేరుగా ఖలీఫాను అడిగేసి లేదనిపించుకుందామనుకుని బయలుదేరి వెళ్ళాడు. ఖలీఫాగారు మిద్దెమీద కూచుని ఉన్నాడు. ద్వారపాలకులు పేదవాణ్ణి అక్కడికి తీసుకుపోయారు.

"ఏలినవారిని ఒక్కటి కోరదామని వచ్చాను. తమరు కరుణించినట్టయితే నాకు తమ ఆస్థాన జ్యోతిష్కుడుగా ఉండాలని ఉంది," అన్నాడు పేదవాడు. ఆ సమయానికే ఒక నౌకరు ఒక సంచీలో ఏదో పెట్టుకుని ఖలీఫావద్దకు వస్తూ దూరాన కనిపించాడు.

"ఆ వచ్చేవాడు ఏం తెస్తున్నాడో చెబితే నిన్ను అలాగే ఆస్థాన జ్యోతిష్కుడుగా పెట్టుకుంటాను," అన్నాడు ఖలీఫా.

పేదవాడి గుండె జారిపోయింది.

"ఏలినవారు మన్నించాలి! తమరిని హమాము నుంచి బయటికి రమ్మన్నాను. ఆ సమయానికే కప్పు కూలింది. కుంటి బాతు కనబడిందన్నాను. దాని పొట్టలో వజ్రపుటుంగరం దొరికింది. కుందేలు ఎంత యుక్తిగలదైతే ఏం లాభం, వేటగాడి ఉచ్చులో పడక తప్పదు!" అన్నాడు పేదవాడు.

ఇంతలో నౌకరు దగ్గిరికి వచ్చి మూటలో ఉన్న కుందేలును ఖలీఫాకు చూపించాడు.

"శబాష్! శబాష్! నీకంటె గొప్ప జ్యోతిష్కుడు ప్రపంచంలో ఉంటాడనుకోను. నిన్ను ఈ క్షణంనుంచే మా ఆస్థాన జ్యోతిష్కుడుగా నియమిస్తున్నాను!" అన్నాడు ఖలీఫా సంతోషంగా.

పేదవాడి రొట్టె విరిగి నేతిలో పడింది. అతడు ఇంటికివచ్చి సంగతి చెప్పగానే, భార్య పొందిన ఆనందానికి అంతే లేదు.



ఫోటోవ్యాఖ్యల పోటీ :: బహుమానం రు. 10 లు

1961 జనవరి సంచికలో ప్రకటింపబడే ఫోటోలకు నమూనాలు





★ పై ఫోటోలకు సరిఐన వ్యాఖ్యలు ఒక్క మాటలోగానీ, చిన్న వాక్యంలోగానీ కావాలి. (రెండు వ్యాఖ్యలకూ సంబంధం వుండాలి.)

★ నవంబర్ నెల 10-వతేదీ లోగా వ్యాఖ్యలు మాకు చేరాలి. తరువాత చేరే వ్యాఖ్యలు ఎంత మాత్రమూ పరిశీలింపబడవు.

★ మాకు చేరిన వ్యాఖ్యలలో అత్యుత్తమంగా వున్న సెట్టుకు (రెండు వ్యాఖ్యలకు కలిపి) రు. 10/లు బహుమానం.

★ వ్యాఖ్యలు రెండూ పోస్టుకార్డుపైన వ్రాసి, ఈ అడ్రసుకు పంపాలి:- చందమామ ఫోటో వ్యాఖ్యల పోటీ, మద్రాసు-26.

నవంబర్ నెల పోటీ ఫలితాలు

మొదటి ఫోటో: ఇన్ని టీకప్పులకు....

రెండవ ఫోటో: ఇద్దరే అతిథులా!

పంపినవారు: వి. వరదాచార్యులు,

C/o వి రామానుజాచారి, సీతారాం బాగ్, H. No.13-1-1/53, హైదరాబాద్.

బహుమతిమొత్తం రు. 10/- ఈ నెలాఖరులోగా పంపబడుతుంది.



ప్రశ్నోత్తరాలు

1. దారపు సీతారామస్వామి రెడ్డి, రెయ్యపాడు

మామగారూ! మాంసాహారి వృక్షములు ఆఫ్రికాఖండములో యున్నవని మా మిత్రుడంటాడు—నాకు ఆశ్చర్యం! మీ అభిప్రాయం?

తమ ఆకులలో చిక్కిన కీటకాలను అట్లాగే పట్టేసి జీర్ణంచేసుకునే చెట్లున్నాయి.

2. ములకల ఖడ్గపాల్, ఏలూరు

చందమామకు కథలు, హాస్యమైన బొమ్మలు, ఫోటో వ్యాఖ్యలు పంపాలంటే, చందమామలో ఏమన్నా సభ్యులుగా చేరవలెనా?

ఏమీ అవసరంలేదు. చందమామకు చందా కట్టటం తప్ప ఇంకొక రకమైన సభ్యత్వం ఏమీ లేదుకూడా.

3. కుంపట్ల సత్యంబాబు, రాజమండ్రి

అన్నయ్యా, ఆకాశంలో మెరిసే మెరుపు చాల కాంతివంతంగా వుంటుంది గదా! ఆ కాంతి ఎలా కల్గుతుంది?

విద్యుచ్ఛక్తివల్ల ఆ కాంతి ఏర్పడుతుంది.

4. వై. పద్మాజీరావు, విజయనగరము

స్థలపురాణం శీర్షికలో ప్రకటించిన, శింగరాయకొండ అను కథ కేవలము కల్పితమా? నిజమా?

మిగిలిన స్థలపురాణాల వంటిదే శింగరాయకొండ కూడానూ.

5. యం. రాజేశ్వర్ రావు, హన్మకొండ

జీవము ఉద్భవించినపుడు మొట్టమొదట పురుషుడా? లేక స్త్రీయా? వీరిలో ఎవరు మొదట జన్మించిరి?

తొలి ప్రాణులలో స్త్రీ పురుష విచక్షణ లేదు. అవి స్వయంభువులు. ఒక ప్రాణి పెరిగి రెండుగా విభజన పొందుతుంది. జీవరాసుల పరిణామంలో స్త్రీ పురుష విచక్షణ వచ్చింది. ఆడా, మగా అన్నవి రెండూ ఒక్కసారే వచ్చాయి.

6. *కె. వి. సత్యనారాయణాచారి, మొగల్తూరు*

అన్నయ్యగారూ! చిత్రకథ మేము వ్రాయవచ్చునా?

రాయవచ్చు.

7. *తొండపు వెంకటసీతారామయ్య, తాడికొండ*

ఆకాశమునుండి అకస్మాత్తుగా చుక్క యేటవాలుగా పడిపోతూ, మధ్య లోనే మాయమౌతుంది. అది ఎక్కడ పడినట్టు? ఏమౌతుంది?

వాటిని రాలుడు చుక్కలంటారు. అయితే అవి నిజంగా చుక్కలు కావు. వాటి అసలు పేరు ఉల్కలు. మనం చూసే ఉల్కలలో చాలాభాగం ఏ మినపగింజ ప్రమాణంలోనో వుండి అతి వేగంగా గాలిపొరలోకి ప్రవేశించేటప్పుడు గాలి రాపిడికి బూడిద అయిపోతాయి. చాలా అరుదుగా ఉల్కలు పొంతం కాలకుండా నేలపై పడటం జరుగుతుంది.

8. *పెనుగొండ వీరరాఘవరావు, రాజమండ్రి*

అక్టోబరు నెల చందమామలో ప్రకటించిన 'నాగానందం' నాటక కథలో, మలయవతి తల్లి జీమూతవాహనుడికి ఎర్రబట్టలు పంపినట్టు వున్నది. ఆ ఎర్ర బట్టలు ఎందుకు పంపవలసి వచ్చింది? సొంత కూతురుని విధవరాలు చేయుటకు ఏ తల్లియైనా సాహసిస్తుందా?

మలయవతి తల్లి జీమూతవాహనుడికి ఎర్రబట్టలు పంపినది వధ్యచిహ్నంగా కానేకాదు. అందులో అత్తగారి లాంఛన ఏదో వున్నట్టు కనిపిస్తుంది. ఆ లాంఛనను నాటకకర్త యుక్తిగా వాడుకున్నాడు.

9. *డి. సుబ్రహ్మణ్యం, పెద్దాపురం*

చందమామలో ప్రచురించు ఫోటో వ్యాఖ్యలకు సంబంధించిన మాటలు ముందుగానే మీరు నిర్ణయించి వుంచెదరా? లేక....?

మీరు పంపే వ్యాఖ్యలలోనుంచే ఉత్తమమైనదానిని ఏరుతాం.


10. *కుమారి పి. పద్మ, నంద్యాల*

చందమామలో బొమ్మలు వేసే శంకర్, ఆంధ్ర సచిత్ర వారపత్రికలో బొమ్మలూ, కార్టూనులూ వేసే శంకర్ ఒకరేనా?

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో బొమ్మలు వేసే శంకర్, చందమామలో హాస్యచిత్రాలు మాత్రమే వేస్తున్నారు. కథలకు చిత్రాలు వేసే శంకర్ వేరు.


చిత్రకథ





దాసూ, వాసూలు ఆడుకునే తోట ప్రాంతాల మేస్తూండే గొర్రెపొటేళ్ళలో ఒకటి, రోజూ వాళ్ళను చూడగానే వెంటబడేది. ఈ సంగతి గొర్రెలుకాచే కుర్రాడితో చెబితే, "అబ్బో, ఆ పొట్టేలు మహా పోట్లది. పులినైనా ఢీకొట్టేస్తుంది. మీరో లెక్క," అన్నాడు. ఒకరోజున దాసూ వాసూలు "టైగర్"కు చారల తువ్వాలు చుట్టి, ముఖానికి పులిబొమ్మ అట్ట కట్టి, గొర్రెపొటేలు మీదికి యిసుకొల్పారు. "టైగర్" దగ్గిరకు రావటం చూస్తూనే, ఆ పోట్ల పొటేలు తారుకుని మందనుంచి పారిపోసాగింది. గొర్రెలు కాచే కుర్రాడు లబోదిబో మంటూ దాని వెంటబడ్డాడు. దాసూ వాసూలు నవ్వుకున్నారు.






Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd., and Published by B. VENUGOPAL REDDI for Sarada Binding Works, 2 & 3, Arcot Road, Madras-26. Controlling Editor: 'CHAKRAPANI'





తొలుతగా భారతదేశంలో తయారైన స్టాప్ సిలిండర్ ప్రెస్సు



మొట్టమొదట భారతదేశంలో తయారైన 'స్టాండర్డు' స్టాప్ సిలిండర్ ప్రింటింగ్ మిషన్, సింగిల్ డెమీ సైజు,—గియర్డ్ ఇంకర్స్, ఫ్లయర్ డెలివరీ, మరియు డబిల్ గాగ్ చక్రములతో సహా; కాగితపు పూర్తి పరిమాణం 19½ అం. × 25½ అం.

ఫోన్: 55096 | తంతి: PRINTMACHO

పూర్తి వివరములకు:

ది స్టాండర్డ్ ప్రింటింగ్ మెషినరీ కంపెనీ,

120/81, సెంబుదాస్ స్ట్రీట్, మద్రాసు - 1.

★

తయారుచేయువారు:

ది స్టాండర్డ్ వర్క్‌షాప్స్,

సెంబియమ్, మదరాసు - 11.

★

దిగువ సామానులను మేము తయారుచేసి సప్లయి చేయగలము:

పేపర్ కటింగ్ మిషన్లు, వైర్-స్టిచింగ్ మిషన్లు, హార్డ్ ప్రెస్సులు, పర్ఫొరేటింగ్ మిషన్లు, డై-స్టాంపింగ్ మిషన్లు, స్టాండర్డ్ ప్లేటెన్ ప్రెస్సులు, కటింగ్ మరియు క్రీసింగ్ మిషన్లు మొదలైనవి.

దీపావళి శుభాకాంక్షలు!

యం. సి. సుందరరాజన్ అండ్ కంపెనీ

290, లింగిసెట్టి వీధి, మదరాసు - 1.

టెలిగ్రాం: VISHNU   ఫోను: 4562   పోస్టుబాక్సు: 182



కళాయి, ఇనుపగొట్టాలు, పైపు ఫిట్టింగులకు
జి. కె. డబ్లియు, ఆరుపలకల బోల్టులు, నట్లు
వగయిరాలకు సంప్రదించండి .... కళింగ
పైపులకు డిస్ట్రిబ్యూటర్లు

బ్రాంచీలు:

కాటూరివారి వీధి, విజయవాడ - 1 ★ జైలురోడ్డు, కోయంబత్తూరు

6, గోడౌను వీధి, బెంగుళూరు సిటీ

అద్వితీయమైన నాణ్యము! అతి సరసమైన మూల్యము !!

FOR Costly PENS
Iris
INKS





ఐరిస్ సిరాలు

ఫౌంటెన్ కలములకు పేరెన్నిక కన్నవి.

1, 2, 4, 12, 24 ఔన్సుల ప్యాకింగులలో లభించును.

తయారుచేయువారు:

రీసెర్చి కెమికల్ లెబొరెటరీస్

మద్రాసు-4 ★ న్యూఢిల్లీ-1 ★ బెంగళూరు-3



గజ్జి దురద



మీ చర్మములోగల కోట్లకొలదీ సూక్ష్మరంధ్రములలో అనేక విధములగు క్రిమి జాలములు దాగియుండి చర్మమునకు దురద, పగుళ్ళు, కలిగించుటయే కాక, గజ్జి, చర్మము రాలుట, చ్మరము మంట, చీడ, తామర, పొడ, మొటిమలు, పాదములలో దురద, తదితర లక్షణ ములను పుట్టించును. సాధారణ చికిత్సలద్వారా క్రిములు నశించకుండుటచే తాత్కాలిక ఉపశాంతి మాత్రమే కలుగును. శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM)తో వెంటనే క్రిములు నశించుటయే గాక మీ చర్మము మృదువుగాను, శుభ్రముగాను ఉండుటకు ఈ మందు తోడ్పడగలదు. చర్మవ్యాధులకు కారణమైన క్రిములను నిశ్చయ ముగా సంహరించు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టువద్ద కొనండి.

(N. 30-1 TEL.)

ఉబ్బసము రొమ్ముపడిశము

జలుబు అరికట్టు విధము

ఊపిరి బిగదీయుట, దగ్గు, శ్లేష్మము, గొంతునొప్పి, ఉబ్బసము, రొమ్ము పడిశము, జలుబు మరియు తాపజ్వరము మొదలగు వ్యాధులతో బాధపడు వేలకొలది రోగులు యిక వీటికి భయపడ నవుసరము లేదు. అమెరికా దేశపు అధునిక ఔషధముతో శాస్త్రోక్తముగా తయారైన ఈ మందు, గుండె, ముక్కు మొదలగు భాగములకు రక్తముద్వారా వ్యాపించి శ్లేష్మమును హరించును. మీకు వెంటనే ఊపిరి బాగుగా సలుపును. దగ్గు శ్లేష్మము తగ్గి పసిబిడ్డవలె నిద్రించగలరు. పూర్తిగా తృప్తి నిచ్చుటకు గ్యారంటీ యివ్వబడిన మెండకో (MENDACO) ను మీ కెమిస్టువద్ద కొనండి.


(M. 33-1 TEL.)



ఇప్పుడు
నడుస్తోంది
కన్నకూతురు
నిర్మాత.. నల్లపరెడ్డి గోపాలరెడ్డి.
మాటలు. పాటలు.. నారపరెడ్డి
సంగీతం.. M. రంగారావు..
దర్శకుడు.. యోగానంద్.
సోల్ డిస్ట్రిబ్యూటర్స్ శ్రీకృష్ణా* సబ్ డిస్ట్రిబ్యూటర్స్. నైజాం. మహేశ్వరీ* సీడెడ్. ఈస్టిండియా ఫిలింకంపెనీ.



ఆధునిక యంత్ర
పరికరములతోను
సాంకేతిక
నిపుణులతోను
అమరివున్న
బ్రహ్మాండమైన సంస్థ





ఆఫ్‌సెట్టు ప్రింటర్సు

ప్రసాద్ ప్రాసెస్ ప్రైవేట్ లి. మదరాసు-26

ప్రతినిధి కార్యాలయాలు :

101, పుష్ప కుంజ్ ఎ, రోడ్డ్, చర్చిగేట్, బొంబాయి - 1. (ఫోన్: 243229)

డి/11, 5 మెయిన్ రోడ్, గాంధినగర్, బెంగళూరు - 9. (ఫోన్: 6555)

సువాసన ప్రసరించే

రెమీ






స్నో ౖ పౌడర్

Aykan

Photo by R. K. Varadarajan.



బహుమతి
పొందిన వ్యాఖ్య

ఇద్దరే అతిథులా!

పంపినవారు:
ఐ. ఐ. చార్యులు - హైదరాబాదు

CHANDAMAMA (Telugu) DEEPAVALI NUMBER 1960 Regd. No. M. 4854



అర్ధనారీశ్వరుడు